అర్జీల పరిష్కారంలో జాప్యం వద్దు


జిల్లా అధికారులకు వినతులు అందిస్తున్న ప్రజలు

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజల నుంచి అందే అర్జీల పరిష్కారంలో ఎలాంటి జాప్యం లేకుండా శ్రద్ధ చూపాలని డీఆర్వో ఉదయభాస్కరరావు సంబంధిత అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన మీకోసం కార్యక్రమంలో ఆయన పలు శాఖల జిల్లా అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం అధికారులనుద్దేశించి మాట్లాడారు. మొత్తం 114 అర్జీలు వచ్చినట్లు వెల్లడించారు. జిల్లా వ్యవసాయాధికారి జడ్ వెంకటేశ్వరరావు, గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా అధికారి దోసిరెడ్డి, పౌరసరఫరాల శాఖ డీఎం శివ రామప్రసాద్, వయోవృద్ధుల సంక్షేమ ట్రైబ్యునల్ సభ్యుడు మేళం దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

★ మంచినీటి చెరువుని ఆనుకుని రొయ్యల చెరువు తవ్వడం వల్ల జలాలు కలుషితమవుతున్నాయని ఇరగవరం మండలం పొదలాడకు చెందిన డి భాస్కరరావు, కృష్ణకుమారి ఫిర్యాదు చేశారు. ★ తమను ఆరోగ్య శాఖకు బదలాయించాలని కోరుతూ గ్రామ-వార్డు సచివాలయాల ఆరోగ్య కార్యదర్శులు కలెక్టరేట్‌లో ఉన్నతాధికారులకు సోమవారం వినతిపత్రం అందజేశారు. 151, 115, 105 జీవో లను సక్రమంగా అమలు చేయాలని కోరారు. సంఘం జిల్లా కమిటీ ప్రతినిధులు భాగ్యలక్ష్మి, సరళప్రకాశ్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

మొగల్తూరులో 19.2 మి.మీ. వర్షం

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో ఆదివారం నుంచి సోమవారం ఉదయం వరకు 5.9 మి.మీ. సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా మొగల్తూరు మండలంలో 19.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మండలాల వారీగా పోడూరు 11.2, పెనుమంట్ర 10.4, నరసాపురం 10.2, యలమంచిలి 10.2 మి.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది.


భీమవరంలో పుర సేవ నమోదు కేంద్రం ఇది. దీనిలో ఫోన్‌ను తొలగించారు. నేరుగా ఎవరైనా వచ్చి ఫిర్యాదు చేస్తే వాటిని నమోదు చేసి సంబంధిత విభాగానికి పంపిస్తున్నారు.

పురసేవ.. ఏదీ తోవ!

కేంద్రాల్లో ఫోను సౌకర్యమూ కరవు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో పురపాలక సంఘాల్లో పౌర సేవ కేంద్రాలు నామమాత్రంగా మారాయి. గతంలో పౌరుల నుంచి వచ్చే ఫిర్యాదులను ఈ కేంద్రాల్లో స్వీకరించి నిర్ణీత గడువు లోగా పరిష్కరించేవారు. వైకాపా పాలనలో ఈ వ్యవస్థ నిర్వీర్యమైంది. ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక దీని పునరుద్ధరణకు చర్యలు చేపట్టింది. ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులకు సూచించినట్లు పురపాలక ఆర్డీ నాగనరసింహారావు చెప్పారు.


భీమవరంలో చిన్నవంతెన పక్కన కల్వర్టు ప్రమాదకరంగా మారింది. రాత్రి వేళ వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారంటూ పట్టణవాసులు ఎం. రాంబాబు, సురేష్ తదితరులు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు.

2013 నుంచి.. కార్యాలయాలకు వెళ్లనవసరం లేకుండానే ప్రజా సమస్యలపై ఫిర్యాదులు చేసేందుకు 2013లో పురసేవ కేంద్రాలను ప్రారంభించారు. ఇంజినీరింగ్, ప్రజారోగ్యం, రెవెన్యూ, విద్యుత్తు, పట్టణ పేదరిక నిర్మూలన, నీటి సరఫరా తదితర విభాగాలకు చెందిన 91 రకాల సేవలను ఆన్‌లైన్ యాప్‌ద్వారా పొందే అవకాశం ఉంది. నేరుగా ఈ కేంద్రాల్లోనూ ఫిర్యాదులు, దరఖాస్తులు అందజేసే అవకాశం ఉండేది. వైకాపా పాలనలో సమస్యలు చెప్పే వీలు లేకుండా చేశారు. కొన్ని కేంద్రాల్లో కనీసం ఫోన్ సౌకర్యం కూడా లేకుండా పోయింది.

- ఆకివీడు కేంద్రంలో కొన్నేళ్లుగా సేవల వివరాలు తెలిపే బోర్డు లేదు. ఇటీవల కాలంలో వస్తున్న ఫిర్యాదులను నమోదు చేసి ఆయా విభాగాల అధికారులకు పంపిస్తున్నారు.
- తాడేపల్లిగూడెం, పాలకొల్లు పట్టణాల్లో పుర సేవలు దాదాపు నిలిచిపోయాయి. కూటమి అధికారంలోకి వచ్చాక ఈ వ్యవస్థను పునరుద్ధరించారు.

కిక్కు.. లెక్క తేలింది!

- ముగిసిన మద్యం దుకాణాల లాటరీ
- ఆరో వంతు రుసుముగా రూ.19.25 కోట్లు

ఈనాడు డిజిటల్, భీమవరం, అర్బన్, టూటౌన్, పట్టణం, న్యూస్‌టుడే: మద్యం దుకాణాల కేటాయింపుపై పది రోజులుగా నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. అధికారులు ప్రకటించిన ప్రకారం సోమవారం ఉదయం కాళ్ల మండలం పెద అమిరంలోని నిర్మలా దేవి వేడుక హాలులో ఉదయం 8 గంటలకు లాటరీ ప్రక్రియ ప్రారంభించారు. తొలుత కలెక్టర్ చదలవాడ నాగరాణి మద్యం దుకాణాలకు సంబంధించిన విధి విధానలను వివరించారు. దుకాణాల వారీగా దరఖాస్తుదారులకు వరుస క్రమంలో టోకెన్లు కేటాయించారు. అనంతరం వాటిని డబ్బాలో వేసి లాటరీ తీసి దుకాణం దక్కిన వారి పేరు, టోకెన్ సంఖ్యలను ప్రకటించారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు ఈ ప్రక్రియ కొనసాగింది. దరఖాస్తుదారులను మాత్రమే లోనికి అనుమతించారు.

● జిల్లాలో ఆకివీడు, భీమవరం, నరసాపురం, పాలకొల్లు, తాడేపల్లిగూడెం, తణుకు ఎక్సైజ్ సర్కిళ్ల పరిధిలో 175 దుకాణాలకు అధికారులు కేటాయించిన గెజిట్ సంఖ్యల వరుస క్రమం ఆధారంగా లాటరీ నిర్వహించారు. సర్కిళ్ల వారిగా ఒక దుకాణానికి అత్యధికంగా ఆకివీడులో 36, భీమవరం 79, నరసాపురం 47, పాలకొల్లు 75, తాడేపల్లిగూడెం 61, తణుకు 46 మంది దరఖాస్తు చేశారు.

ఒకటి కాదు ఏడు.. భీమవరం సర్కిల్ పరిధిలో లాటరీ ప్రక్రియ ప్రారంభమయ్యాక గెజిట్ సంఖ్య 24కు సంబంధించి కొంత గందరగోళం నెలకొంది. కలెక్టర్ నాగరాణి టోకెన్ తీశాక ఏడో అంకెను పొరపాటున ఒకటిగా చెప్పారు. మిగిలిన రెండు రిజర్వు నంబర్లు తీసి మూడింటిని టేబుల్ మీద ఉంచగా జరిగిన తప్పిదాన్ని ఎక్సైజ్ ఎస్పీ కుమరేశన్ గుర్తించి సరిచేశారు. లైవ్ వీడియోను వెనక్కి స్ట్రీమింగ్ చేయించి కలెక్టర్ తీసిన టోకెన్‌ను మరోసారి ప్రదర్శించారు.


లాటరీని తీసిన అనంతరం నంబరు చూపుతున్న నాగరాణి


హాలులో కిక్కిరిసిన జనం

నాలుగు కౌంటర్లు.. లాటరీ ప్రక్రియ ముగిసిన వెంటనే దుకాణాలు పొందిన వారికి ప్రొవిజనల్ సర్టిఫికెట్ అందజేశారు. వేదిక పక్కనే నాలుగు నగదు కౌంటర్లు ఏర్పాటు చేశారు. దరఖాస్తు పత్రాల పరిశీలన అనంతరం అక్కడే చలనాలు తీయించి నగదు కట్టించుకున్నారు.

మహిళలు సైతం.. మహిళలు సైతం తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు లాటరీ ప్రక్రియకు హాజరయ్యారు. వీరిలో 60 ఏళ్ల వృద్ధుల నుంచి 18 ఏళ్ల యువతులు కూడా ఉన్నారు. మొత్తంగా 14 మంది మహిళలు దుకాణాలను దక్కించుకున్నారు.

సర్కిల్	దుకాణాలు	దరఖాస్తులు
భీమవరం	40	1,287
తాడేపల్లిగూడెం	36	1,224
తణుకు	33	8,77
నరసాపురం	24	958
పాలకొల్లు	19	873
ఆకివీడు	23	408

వరించిన అదృష్టం.. భీమవరంలో కొందరు సిండికేట్‌గా ఏర్పడి 150 దుకాణాలకు దరఖాస్తు చేయగా అయిదు వచ్చాయి. ఆకివీడు, కాళ్ల మండలాల్లో కంచి రామచరణ్‌కు ఏకంగా అయిదు దుకాణాలు వచ్చాయి. అతడి బంధువు సత్య జగదీశ్ ప్రసాద్ కాళ్ల, ఉండి మండలాల్లో మూడు దుకాణాలు దక్కించుకున్నారు. అల్లూరి ఉదయభాస్కరరావు (పాలకొల్లు), కలిదిండి వెంకటసత్యనారాయణవర్మ రాజు (మొగల్తూరు), గొట్టుముక్కల వెంకటరామసూర్యనారాయణరాజు (యలమంచిలి)లకు ఆయా మండలాల్లో రెండేసి చొప్పున దుకాణాలు వచ్చాయి.

జిల్లాలో ఇలా.. మొత్తం దుకాణాలు **175** వచ్చిన దరఖాస్తులు **5,627** వసూలైన రుసుము **రూ.112.54 కోట్లు** తొలి విడత చెల్లింపులు **రూ.19.25 కోట్లు**

సర్వ దేవతలకు ఆహ్వానం..!

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి ఆశ్వయుజ మాస తిరుకల్యాణోత్సవాలు కనుల పండువగా సాగుతున్నాయి. రెండో రోజు సోమవారం ధ్వజారోహణ నిర్వహించారు. శ్రీవారి కల్యాణ వైభవాన్ని వీక్షించేందుకు సర్వ దేవతలను ఆహ్వానించేలా ముహూర్త సమయంలో గరుడ పటం ఎగురవేశారు. స్వామివారి విశేష అలంకారాల్లో భాగంగా బక సంహార అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.


ధ్వజారోహణ జరిపిస్తున్న అర్చకులు

పల్లె ప్రగతికి శ్రీకారం

తొలి రోజు 43 పనులకు శంకుస్థాపన

భీమవరం వన్‌టౌన్, ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: 'పల్లె పండగ - పంచాయతీ వారోత్సవాలు' పేరిట రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రజాప్రతినిధులు సోమవారం భూమి పూజ చేశారు. వైకాపా ప్రభుత్వ హయాంలో గ్రామాల అభివృద్ధిని విస్మరించింది. ఫలితంగా మౌలిక సదుపాయాల కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఎన్డీయే ప్రభుత్వం గ్రామాల సుస్థిర అభివృద్ధి దిశగా ప్రణాళికలు రూపొందించింది. దీనిలో భాగంగా 'స్వర్ణ గ్రామ పంచాయతీ' పేరుతో ఆగస్టు 23న ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 937 పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించారు. ఈ సభల్లో ఆమోదించిన పనులను ఉపాధి హామీ పథకం నిధులతో పూర్తి చేయాలని నిర్ణయించారు. వీటికి ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు శంకుస్థాపనలు చేయనున్నారు.

జనవరి నాటికి పూర్తి.. ఈ పనులను జనవరి నెలాఖరు లోపు పూర్తయ్యేలా ప్రణాళిక సిద్ధం చేశారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మండలం గోరింటాడ గ్రామంలో మంత్రి నిమ్మల రామానాయుడు సీసీ రహదాల నిర్మాణానికి, ఏలూరు జిల్లా నూజివీడులో మంత్రి పార్థసారథి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఎమ్మెల్యేలు పులపర్తి రామాంజనేయులు, బొలిశెట్టి శ్రీనివాస్, ధర్మరాజు తదితరులు వారి నియోజకవర్గాల్లో చేపట్టిన పనులను భూమిపూజ చేసి ప్రారంభించారు.

తొలిరోజు ప్రారంభించినవి

జిల్లా	పనులు	నిధులు (రూ.కోట్లలో)
ఏలూరు	27	3.72
పశ్చిమ	26	3.63


ఇలా వండితే.. ఏ రోజూ కాదనం!

- మధ్యాహ్న భోజనం మెనూ మార్పు
- నవంబర్ నుంచి అమలుకు కసరత్తు

పాలకొల్లు, న్యూస్‌టుడే: పేద విద్యార్థులకు కడుపు నిండా భోజనం పెడితే, చదువుపై దృష్టి సారిస్తారనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిందే మధ్యాహ్న భోజన పథకం. 2019కి ముందు మధ్యాహ్న భోజనం నిర్వహణలో ఉమ్మడి జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో కొనసాగేది. తర్వాత కాలంలో వైకాపా ప్రభుత్వం ప్రవేశపెట్టిన మెనూ నచ్చక కొన్నిసార్లు 50 శాతం మంది కూడా బడి భోజనం చేయని దుస్థితి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దీనిపై దృష్టి సారించింది. రాష్ట్రమంతా ఒక్కటే మెనూ కాకుండా ప్రాంతీయ అభిరుచులకు అనుగుణంగా జిల్లాల వారీగా మెనూ రూపొందిస్తుంది. ఉమ్మడి జిల్లాకు కొత్త మెనూ కోసం తల్లిదండ్రుల నుంచి ఉపాధ్యాయులు అభిప్రాయ సేకరణ పూర్తిచేసి అమరావతి పంపించారు.

సన్న బియ్యానికి మొగ్గు.. ఉన్నత పాఠశాలల్లో 8వ తరగతి పైబడిన విద్యార్థులు సన్న బియ్యం అయితేనే తింటారని పలువురు తల్లిదండ్రులు తెలిపారు. మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలంటే సన్నబియ్యం సరఫరా చేయాలని డిమాండ్ తెరపైకి వచ్చింది. గుడ్డుకు బదులుగా ప్రోటీన్లు అందించే పండును ఒకరోజు అందించాలని విద్యార్థులు కోరుతున్నారు. సాధ్యాసాధ్యాలపై కసరత్తు పూర్తిచేసి బాలల దినోత్సవం నాటికి కొత్త మెనూ అమల్లోకి తీసుకురావాలని భావిస్తున్నారు.


భోజనం చేస్తున్న విద్యార్థులు



ఇచ్చేది పెంచాలి.. వంట నిర్వాహకులకు ఖర్చుల నిమిత్తం ఇచ్చే బిల్లు నుంచి జీతం వరకు మరికొంత మొత్తాన్ని పెంచితే నాణ్యతగా అందించడానికి అవకాశం ఉంటుందనే అభిప్రాయం కూడా అధికారుల నుంచి ఉపాధ్యాయుల వరకు వెల్లడించారు. గ్యాస్ సిలిండర్లకు ఎక్కువ ఖర్చవుతున్నందున రాయితీపై అందించాలని కోరారు. ప్రస్తుతం అందిస్తున్న జీతం రూ.3 వేలు చాలా కాలంగా కొనసాగుతున్నందున దానిని కనీసం రూ.పది వేలకు పెంచాలని నిర్వాహకులు కోరుతున్నారు. దీనిపై జిల్లా మధ్యాహ్న భోజన పథకం పర్యవేక్షణాధికారి ఎన్.సత్యనారాయణను సంప్రదించగా మెనూ మార్పు కోసం ప్రతిపాదనలు పంపించామని నవంబర్ నాటికి అమల్లోకి రావొచ్చని చెప్పారు.



తాడువాయి.. ఆక్రమణలదే పైచేయి..!

- రూ.కోట్ల విలువైన స్థలాలు మాయం
- చెరువులు, రహదారుల కబ్జా

తాడువాయి (జంగారెడ్డిగూడెం), న్యూస్‌టుడే: పోలవరం నిర్వాసితుల కోసం తాడువాయి సమీపంలో కడుతున్న పునరావాస కాలనీలతో భవిష్యత్తులో అతి పెద్ద పట్టణంగా అవతరించే అవకాశం ఉంది. దీంతో తాడువాయిలో అదే స్థాయిలో ఆక్రమణలు వెలుస్తున్నాయి. ఖాళీ జాగా కనిపిస్తే చాలు పాగా వేస్తున్నారు. ఈ గ్రామంలో విలువైన చెరువులు, పుంత రోడ్లు, రహదారి అంచులు, చివరకు శ్మశాన వాటికలను సైతం కబ్జా చేస్తున్నారు. ఆక్రమిత స్థలాలు భవంతులు, దుకాణాలు, హోటళ్లు, కిళ్లీ బడ్డీలుగా మారాయి. సమీప సర్వే నంబర్లతో క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. ఆక్రమణలను తొలగించి విలువైన ప్రభుత్వ స్థలాలను కాపాడటంలో యంత్రాంగం విఫలమవుతోంది. చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇప్పటికే పలువురు మీకోసం, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికల్లోనూ వినతులు ఇచ్చారు. పంచాయతీ గ్రామ సభల్లోనూ గగ్గోలు పెట్టారు.

గ్రామంలోని ఫకీరు కుంట చెరువు విస్తీర్ణం 4.76 ఎకరాలు కాగా.. ఆక్రమణల కారణంగా ప్రస్తుతం సుమారు ఎకరానికి కుచించుకుపోయింది. గ్రామానికి మధ్యలో, తల్లాడ - దేవరపల్లి జాతీయ రహదారిని ఆనుకొని ఉండటంతో భవనాలు, దుకాణాలు వెలిశాయి. విలువైన ప్రదేశం కావడంతో ఇక్కడ ఎకరం రూ.50 లక్షలు ఉంది. దీంతో ఆక్రమిత స్థలం సుమారు రూ.1.50 కోట్లు పైమాటే. చెరువుకు కొలతలు వేసి హద్దులు నిర్ణయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

● గొల్లకుంట నుంచి వెంకటచెరువు సమీపంలోని 100 లింకుల పుంత రోడ్డు ఆక్రమణల్లో ఉంది. దీన్ని సర్వే చేసి ఆక్రమణల నుంచి కాపాడాలని కోరుతున్నారు.



తల్లాడ-దేవరపల్లి జాతీయ రహదారి నుంచి ములగలంపల్లి వెళ్లే రోడ్డు ఆక్రమణల్లో ఉంది. అంచులను ఆక్రమించి దుకాణాలు నిర్మించారు. ఈ కారణంగా పలు చోట్ల ఇరుకుగా మారింది. జాతీయ రహదారి నుంచి పంచాయతీ కార్యాలయం మీదుగా గ్రామంలోకి వెళ్లే మార్గం ప్రారంభంలో ఇరువైపులా ఆక్రమణలున్నాయి. ఈ కారణంగా వాహనాల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారిపైకి వచ్చేవారికి రోడ్డు కనిపించక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల ఓ ద్విచక్ర వాహన దారుడు మృతి చెందాడు.

తీర్మానం చేస్తే సర్వే చేస్తాం.. గ్రామ పంచాయతీ తీర్మానం చేసి దరఖాస్తు చేస్తే సర్వే చేసి హద్దులు నిర్ణయిస్తామని తహసీల్దార్ స్లీవజోజి తెలిపారు. ఆక్రమణలను గుర్తించేందుకు ఫకీరుకుంట చెరువు, తల్లాడ -దేవరపల్లి జాతీయ రహదారి సర్వే ప్రారంభించామని గ్రామ కార్యదర్శి సునీల్ తెలిపారు. మిగిలిన ఆక్రమణలపైనా దృష్టి పెడతామని చెప్పారు.

ఎగసిపడుతున్న అలలు



మొగల్తూరు, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో సముద్ర అలలు ఉద్ధృతంగా మారాయి. పేరుపాలెంసౌత్, కేపీపాలెంసౌత్‌లలో సముద్ర అలలు ప్రమాదకరంగా ఎగసిపడుతున్నాయి. తుపాను ఉద్ధృతి తగ్గేవరకు పర్యాటకులకు అనుమతి లేదని తహసీల్దారు కె.రాజకిశోర్ తెలిపారు. సముద్రంలోకి చేపల వేటకు వెళ్లొద్దని ఆయన మత్స్యకారులకు సూచించారు.

భారత రక్షణ రంగానికి గుర్తింపు తెచ్చిన సూరి భగవంతం

మంత్రి కొలుసు పార్థసారథి

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: భారత రక్షణ రంగానికి ప్రపంచ స్థాయి గుర్తింపు తెచ్చిన వ్యక్తి డా.సూరి భగవంతం అని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. డీఆర్‌డీవో పూర్వపు డైరెక్టర్ డా.సూరి భగవంతం 115వ జయంతి సందర్భంగా ఏలూరు జిల్లా ఆగిరిపల్లిలోని శ్రీశోభనాద్రి లక్ష్మీనరసింహ వేద పాఠశాల ఆవరణలో ఆయన కాంస్య విగ్రహాన్ని సోమవారం అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, డీఆర్‌డీవో పూర్వపు ఛైర్మన్ డా.జి.సతీశ్ రెడ్డిలతో కలిసి మంత్రి పార్థసారథి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. నూజివీడులో డా.సూరి భగవంతం స్మారక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో విశిష్ట కృషి చేసిన వారికి ఆయన పేరిట అవార్డులు ప్రదానం చేసేందుకు ట్రస్టు నెలకొల్పాలని సూచించారు. దానికి తాను రూ.5 లక్షలు విరాళంగా అందజేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. దేశ రక్షణలో ప్రధాన పాత్ర వహించే బాలిస్టిక్ లాంచింగ్ పాడ్‌ను కృష్ణాజిల్లా నాగాయలంక సమీపంలో ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదించిందని చెబుతూ, దాని కోసం కృషి చేసిన డా.సతీశ్‌రెడ్డిని ఆయన అభినందించారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాటాడుతూ..తెలుగు నేలపై జన్మించిన మహనీయులకు జాతీయ స్థాయిలో గుర్తింపు తేవాలన్నారు. డా.జి.సతీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశ రక్షణకు ఇతర దేశాల నుంచి పరికరాలు దిగుమతి చేసుకునే స్థాయి నుంచి ఎగుమతి చేసే స్థాయికి మనం చేరుకోవడంలో డా.సూరి భగవంతం ముఖ్య పాత్ర పోషించారన్నారు. డా.సూరి భగవంతం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఎస్.బి.రామ్ తదితరులు పాల్గొన్నారు.


విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి కొలుసు, పక్కన బుద్ధప్రసాద్, సతీశ్ రెడ్డి

సహాయ కేంద్రం ఏర్పాటు

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున విద్యుత్తు ప్రమాదాలు, సరఫరాలో అంతరాయాల నివారణకు చర్యలు చేపట్టినట్లు ఆ శాఖ జిల్లా పర్యవేక్షణ ఇంజినీర్ ఆలపాటి రఘునాథ్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్, విద్యుత్తు పంపిణీ సంస్థ ఛైర్మన్ ఆదేశాల మేరకు పరిస్థితిని పర్యవేక్షించేందుకు జిల్లా కార్యాలయంలో 24 గంటల పాటు పనిచేసి సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఎక్కడైనా విద్యుత్తు సమస్యలు తలెత్తితే 94409 02926, 94906 10143 లేదా 1912 నంబర్లకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. తెగిపడిన విద్యుత్తు తీగలు, విరిగిన స్తంభాలు, తీగలపై పడిన చెట్ల కొమ్మలను తాకవద్దని సూచించారు.

పేరు మారింది.. తీరుమారలేదు!

జిల్లాలో ఫిర్యాదుల వేదిక పరిస్థితి

పాలకొల్లు, నరసాపురం, న్యూస్‌టుడే: ప్రతి సోమవారం మండల కేంద్రాల్లో నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమానికి గతంలో ఉన్న పేరుమారిందిగాని తీరు ఏ మాత్రం మారలేదు. జిల్లాలోని మొగల్తూరు, నరసాపురం, యలమంచిలి, పెనుగొండ, పెనుమంట్ర మండలాల్లో ఈ కార్యక్రమాన్ని సోమవారం పరిశీలించినపుడు తీవ్ర నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనబడింది. 22 శాఖలకు సంబంధించిన అధికారులు హాజరు కావాల్సి ఉండగా పదుల సంఖ్యలో గైర్హాజరయ్యారు. మొగల్తూరులో విద్యుత్తు సరఫరా నిలిచిపోయి చీకట్లోనే అధికారులు కూర్చోవాల్సిన దుస్థితి. పెనుమంట్ర, నరసాపురం మండలాల్లో ఒక్క అర్జీ కూడా అందలేదు. పెనుమంట్ర మండలంలో హాజరైన అధికారులు కొంతసేపు ఉండి సమయానికంటే ముందే వెనుదిరిగారు. మిగిలిన చోట నాలుగైదు అర్జీలొచ్చాయి. కొన్ని మండలాల్లో దూర దృశ్య శ్రవణ పరికరాలు పనిచేయడం లేదు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ఏశాఖ అధికారైనా వస్తే వచ్చినట్లు లేకపోతే లేదు. ఈ పరిస్థితిపై నరసాపురం ఆర్డీవో దాసి రాజును 'న్యూస్‌టుడే' సంప్రదించగా .. సమయానికి ఖచ్చితంగా అన్నిశాఖల అధికారులు హాజరవ్వాలన్నారు. లేదంటే మెమోలు జారీ చేస్తామని చెప్పారు.


యలమంచిలిలో అర్జీ పరిశీలిస్తున్న తహసీల్దార్



సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే నాయకర్

ఉపాధి హామీతో గ్రామాల అభివృద్ధి: కలెక్టర్

నరసాపురం, న్యూస్‌టుడే: ఉపాధిహామీ పథకంలో కూలీలకు పనిదినాలు కల్పించడంతో పాటు గ్రామాలను అభివృద్ధి చేసుకోవచ్చని కలెక్టర్ సీహెచ్ నాగరాణి అన్నారు. 'పల్లె పండగ'లో భాగంగా నరసాపురం మండలం మల్లికపురంలో సోమవారం డ్వామా నిధులు రూ.10 లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్డును ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పల్లెల అభివృద్ధి తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అన్నారు. ఇప్పటికే గుర్తించిన పనులన్నిటిని వచ్చే జనవరికి పూర్తిచేస్తామన్నారు. గ్రామంలో లోఓల్టేజీ, వీధి దీపాలు, తాగునీరు తదితర సమస్యలను ప్రజలు కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో డ్వామా పీడీ కేసీహెచ్ అప్పారావు, తహసీల్దారు రాజరాజేశ్వరి, ఎంపీడీవో కృష్ణంరాజు, పీఆర్ డీఈ సత్యనారాయణ, పలుశాఖల సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.



విదేశీ విద్యపై ఆసక్తి

- తోడ్పాటునందిస్తున్న ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో ఏటా పెరుగుతున్న విద్యార్థులు

ఉమ్మడి జిల్లా నుంచి ఏటా విదేశాలకు వెళ్లి చదివే వారి సంఖ్య పెరుగుతోంది. గతంలో ఇంజినీరింగ్ పూర్తి చేసిన వారు ఎంఎస్ లేదా పీజీ చేయడానికి విదేశాలకు వెళ్లేవారు. ప్రస్తుతం అక్కడే ఇంజినీరింగ్, డిగ్రీ చేసేందుకు సైతం ఆసక్తి చూపుతున్నారు. - న్యూస్‌టుడే, ఏలూరు విద్యా విభాగం

అక్కడికే ఎందుకు..?

విదేశాల్లో విద్యాభ్యాసం చేస్తే అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలు అందిపుచ్చుకోవచ్చు. ఎంఎస్ పూర్తి చేస్తే ఆర్థిక స్థిరపడే అవకాశం బలోపేతం కావచ్చు. విదేశీ విశ్వవిద్యాలయాలు విద్యార్థులకు ఎక్కువ శాతం ఉపకార వేతనాలిచ్చి ప్రోత్సహిస్తున్నాయి. దీనికితోడు ఆంధ్రప్రదేశ్‌లో గత ప్రభుత్వ హయాంలో యువతకు సరైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకపోవడంతో విదేశాల్లో చదివి అక్కడే స్థిరపడేందుకు మొగ్గు చూపుతున్నారు.

★ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నుంచి ఏటా దాదాపు 1,500 మంది విద్యార్థులు పీజీ, పీహెచ్‌డీ, ఎంబీబీఎస్ చదవడానికి విదేశీ బాట పడుతున్నారు. ఇందులో పీజీ చేసేవారు అత్యధికం. 2014-19 తెదేపా హయాంలో ఎన్టీఆర్ విదేశీ విద్యా పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 5 వేల మంది విద్యార్థులను ప్రోత్సహించారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం ఆ పథకానికి నిధులు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టింది. తాజాగా ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడటంతో.. బకాయిలున్న వారికి సైతం ఆ నిధులు వారి ఖాతాల్లో జమ చేసింది. ఈ నేపథ్యంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, కాపు, ఇతర ఈబీసీ వర్గాల విద్యార్థులు ప్రభుత్వ ప్రోత్సాహంతో విదేశాల్లో చదవడానికి సిద్ధమవుతున్నారు.

ప్రవేశ పరీక్షలపై దృష్టి



ఇంజినీరింగ్ పూర్తి చేసి ఎంఎస్ చేయాలనుకునేవారు జీఆర్ఈ రాయాల్సి ఉంటుంది. ఎంబీఏ చేయాలనుకునే వారు జీమ్యాట్ రాయాలి. వీటితో పాటు ఐఈఎల్‌టీఎస్, టోఫెల్ పరీక్షలు ఉంటాయి. జీఆర్ఈలో 340కి 315 మార్కులు వస్తేనే టాప్ 200 విశ్వవిద్యాలయాల్లో సీటు వస్తుంది. డిగ్రీ స్థాయిలో 70 శాతానికి పైగా మార్కులుండాలి. విద్యార్థి డిగ్రీ స్థాయిలో చేసే ప్రాజెక్టు, పేపర్ పబ్లికేషన్, ఇంటర్న్‌షిప్‌లను కూడా విశ్వవిద్యాలయాలు సీటిచ్చే సమయంలో పరిగణనలోకి తీసుకుంటున్నాయి. - జేవీ మూర్తి, ఇన్‌విక్టా కన్సల్టెన్సీ, ఎండీ

డిగ్రీ చదివేందుకు...



ఇటీవల డిగ్రీ చదవడానికి ఉమ్మడి జిల్లా నుంచి ఎక్కువ మంది విద్యార్థులు విదేశాలు వెళుతున్నారు. అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలుండటంతో దీనిగా అడుగులు వేస్తున్నారు. అలాంటి వారిలో మెరిట్‌ను గుర్తించి విదేశీ విశ్వవిద్యాలయాలు 50 నుంచి 70 శాతం వరకు ఉపకార వేతనాలిచ్చి ప్రోత్సహిస్తున్నాయి. విదేశాల్లో చదవాలనుకునే వారు అక్కడి విశ్వవిద్యాలయాలపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలి. లేనిపక్షంలో ఇబ్బందులు తప్పవు. - బి.దుర్గాప్రసాద్, తక్షశిల ఐఏఎస్ అకాడమీ, ఛైర్మన్



గొరింటాడలో పూజలు చేస్తున్న మంత్రి

ఎన్డీయే ప్రభుత్వంతోనే గ్రామ స్వరాజ్యం : నిమ్మల

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: బాపూజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం ఎన్డీయే ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు మండలంలోని గొరింటాడ, సగంచెరువు గ్రామాల్లో పల్లె పండగ కార్యక్రమాలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పల్లె పండగ కార్యక్రమాలు పల్లెల రూపు రేఖలు మారుస్తాయన్నారు. రెండు గ్రామాలకు ఒక్క రోజులో రూ.2 కోట్ల అభివృద్ధి క్రతువు చేపట్టడం ఒక చరిత్ర అన్నారు. గత ప్రభుత్వం పంచాయతీలను నిర్వీర్యం చేసి సర్పంచులను ఇబ్బంది పెట్టిందన్నారు. నేటి ప్రభుత్వం పంచాయతీలు ఆర్థిక పరిపుష్టి పొంది పాలకవర్గాలు తలెత్తుకునేలా చేస్తోందన్నారు. కార్యక్రమంలో డీఈఓ [illegible], కలవపలు దుర్గ రామస్వామి, తహసీల్దార్ జి.నరేశ్‌కుమార్, ఈవోపీఆర్డీ మూర్తిరాజు, సర్పంచులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఎంపిక పోటీలు వాయిదా

ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే: స్థానిక అల్లూరి సీతారామరాజు మైదానంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించాల్సిన అండర్-14, 17 విభాగాల బాలబాలికల హాకీ, ఆర్టిస్టిక్ ఎంపిక పోటీలు వాయిదా పడ్డాయి. స్థానిక కలెక్టరేట్ సమీప ఇండోర్ స్టేడియంలో యోగా ఎంపిక పోటీలు యథావిధిగా కొనసాగనున్నాయి. వాయిదా పడిన ఎంపిక పోటీల నిర్వహణ తేదీని తర్వాత ప్రకటిస్తామని ఎస్‌జీఎఫ్ కార్యనిర్వహణాధికారిణి అలివేలు మంగ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలోల్లో)
[illegible]: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 140, 149, 160 చికెన్ విత్ స్కిన్ - 270 చికెన్ స్కిన్‌లెస్ - 280.

అధ్వాన ఘాట్లు.. స్నానాలకు పాట్లు

నరసాపురంలోని పవిత్ర గోదావరి తీరంలోని పలుఘాట్లలో అపరిశుభ్ర వాతావరణం తాండవిస్తోంది. ఇటీవల వరదలకు ఘాట్లలోని మెట్లపై బురద పేరుకుపోయింది. దీనిని సకాలంలో తొలగించకపోవడంతో అందులో వ్యర్థాలు పేరుకుపోయాయి. స్నానాలకు వెళ్లే భక్తులు, సందర్శకులు ముక్కుమూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. [illegible] విరిగిపోయిన బల్లలే కనిపిస్తున్నాయి. నిర్వహణ కొరవడటంతో మరుగుదొడ్లు అధ్వానంగా మారాయి. అధికారులు పరిశీలించి ఘాట్లలో సౌకర్యాలను మెరుగుపరిచి గోదావరి తీరాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని పర్యాటకులు కోరుతున్నారు. - ఈనాడు, నరసాపురం



పంటువరేవు సమీపంలోని ఘాట్‌లో విరిగిన బల్ల



బురదమయంగా వలందర రేవు

ఎనిమిది మందికి శస్త్ర చికిత్సలు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమలలోని విర్క్ ఆసుపత్రిలో సోమవారం నిర్వహించిన వైద్య శిబిరంలో ప్రముఖ జాయింట్ రిప్లేస్‌మెంట్ సర్జన్‌లు కృష్ణకిరణ్, నీల్‌శీత్‌లు 20 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి, 8 మందికి తుంటి, మోకాలి శస్త్ర చికిత్సలు విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గుప్తా ఫౌండేషన్ ఛైర్మన్ ఎం.ఎం.గుప్తా సహకారంతో 16 మంది దివ్యాంగులకు ప్రోస్థసిస్ 3డీ ప్రింట్‌తో తయారైన కృత్రిమ అవయవాలు, కాలిపర్స్ అందజేసినట్లు ఆసుపత్రి ఛైర్మన్ ఎన్వీ సుధాకరరావు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టీలు ఐవీఆర్ సుధాకర్, వి.నారాయణమూర్తి, వైద్యులు భవ్యచంద్, హమీద్, బాలాజీ, విహారి, పీవీ నాగేంద్రబాబు, సింధు, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.



రోగులతో మాట్లాడుతున్న వైద్యులు కృష్ణకిరణ్, నీల్ శీత్

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

● భర్త మృతి ● భార్యకు గాయాలు

బాదంపూడి (ఉంగుటూరు), న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో భర్త మృతి చెందగా.. భార్యకు గాయాలైన ఘటన 216ఏ జాతీయ రహదారిపై సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. బొమ్మిడికి చెందిన యర్రా పెద్దిరాజు(70), నాగమణి దంపతులు ఉంగుటూరులోని బ్యాంకుకు ద్విచక్ర వాహనంపై వెళ్లారు. పని ముగించుకుని తిరిగి ఇంటికి వస్తుండగా.. మార్గం మధ్యలోని బాదంపూడి వై జంక్షన్ వద్ద రావులపాలెం నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు ఢీకొంది. ప్రమాదంలో పెద్దిరాజు అక్కడికక్కడే మృతి చెందగా.. ఆయన భార్యకు తీవ్ర గాయాలయ్యాయి.



ప్రమాదానికి కారణమైన కారు

ఆసుపత్రిలోనే బాధితురాలు.. పట్టించుకోని అధికారులు

నరసాపురం, న్యూస్‌టుడే: నరసాపురం నుంచి విశాఖపట్నం వెళ్లే ఆర్టీసీ బస్సుకు ఈ నెల 6న అనకాపల్లిలోని బింగిపేట వద్ద జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో గాయపడిన నరసాపురానికి చెందిన పలువురు నేటికీ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఆర్టీసీ సంస్థ తరఫున తమకు ఏ విధమైన సహకారం అందలేదని, కనీసం అధికారులు పలకరించిన పాపాన పోలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారి కథనం మేరకు.. ప్రమాదానికి గురైన బస్సులో నరసాపురానికి చెందిన పలువురు గాయపడ్డారు. వారిలో మొగల్తూరు కొండాలపాలేనికి చెందిన రాణి ఎస్తేరు రెండు కాళ్లకు తీవ్ర గాయాలై విశాఖపట్నంలో ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆమె కాళ్లకు మూడు పర్యాయాలు శస్త్రచికిత్స చేయాల్సి ఉందని వైద్యులు స్పష్టం చేశారు. శస్త్రచికిత్సలకు ఆరోగ్యశ్రీ వర్తించకపోవడంతో మొత్తం రూ.3 లక్షలు పైబడి చెల్లించాల్సి ఉందని ఆసుపత్రి వర్గాలు తెలిపాయని ఆమె భర్త డేవిడ్ చెప్పారు. తూర్పుతాళ్లులోని ప్రైవేటు బ్యాంకు మేనేజరుకు గడ్డానికి గాయం కావడంతో శస్త్రచికిత్స చేయాల్సి ఉందని వైద్యులు చెప్పారని ఆయన మిత్రులు తెలిపారు. దీనిపై 'న్యూస్‌టుడే' ఆర్టీసీ నరసాపురం డిపో మేనేజరు సత్తి సుబ్బన్నరెడ్డిని సంప్రదించగా బాధితులు శస్త్రచికిత్స చేయించుకున్న బిల్లులు అందజేస్తే ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. అక్కడ నుంచి వచ్చే ఆదేశాల మేరకు చర్యలు చేపడతానన్నారు.

అప్పుల బాధతో డ్రైవర్ ఆత్మహత్య

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: అప్పుల బాధ తట్టుకోలేక పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన పాలకొల్లులో చోటు చేసుకుంది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక ఏవీఎస్ఎన్ కాలనీకి చెందిన సానబోయిన సురేష్(44) కారు డ్రైవర్‌గా పనిచేస్తుండటంతో పాటు కార్లను క్రయ, విక్రయాలు చేస్తుంటారు. వ్యాపార రీత్యా అప్పులు చేసి మనస్తాపంతో సోమవారం తెల్లవారుజామున పురుగుల మందు తాగి పడుకున్నారు. ఉదయం ఈ విషయాన్ని భార్య దుర్గాలక్ష్మి గుర్తించి బంధువులకు సమాచారం అందించారు. వెంటనే అతన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. సురేష్‌కు భార్య, ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ కె.రజనీకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బోట్ల యజమానులు నిబంధనలు పాటించాలి

పోలవరం, న్యూస్‌టుడే: పాపికొండల పర్యాటకులను తీసుకెళ్లే బోట్ల యజమానులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని పోలవరం అటవీ శాఖ అధికారి ఎస్కే వలీ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం నోటీసులు పంపారు. సాధ్యమైనంత వరకు పర్యాటకులు ప్లాస్టిక్ సంచులు నదిలో వేయకుండా చూడాలన్నారు. జంతువులకు శబ్ద కాలుష్యం కల్పించొద్దన్నారు. నోటీసులు అందుకున్న వెంటనే బోట్ల యజమానులు గుంటూరులోని చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ నుంచి అనుమతులు పొందాలన్నారు.



అడ్డంగా పెట్టిన ఇనుప రాడ్లు

మొరాయించిన రైల్వే గేటు

పాలకొల్లు పట్టణం, న్యూస్‌టుడే: పాలకొల్లు రైల్వేగేటు సోమవారం మొరాయించింది. గేటులో సాంకేతిక లోపం ఏర్పడడంతో రైల్వే సిబ్బంది రైలు వచ్చే సమయంలో రెండు ఇనుప రాడ్లను అడ్డంగా పెట్టి రాకపోకలను నియంత్రించారు. ఈ ప్రక్రియకు ఎక్కువ సమయం పట్టడంతో పాలకొల్లు- భీమవరం జాతీయ రహదారిపై వాహనచోదకులు ఇబ్బంది పడ్డారు. సాయంత్రానికి సాంకేతికలోపం సరిచేసి గేటును పునరుద్ధరించారు.

ఎస్సీ, ఎస్టీలకు డీఎస్సీ ఉచిత శిక్షణ

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: మెగా డీఎస్సీకి సన్నద్ధమవుతున్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు వసతితో కూడిన ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి జయప్రకాశ్ తెలిపారు. టెట్ అర్హత కలిగి, కుటుంబ వార్షికాదాయం రూ.2.50 లక్షల లోపున్న వారు ఈ నెల 21లోపు జ్ఞానభూమి పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

'టెట్'కు 63 మంది గైర్హాజరు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఏలూరు సమీప సిద్ధార్థ క్వెస్ట్ సీబీఎస్ఈ పాఠశాల కేంద్రంలో ఉపాధ్యాయ అర్హత పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం ఉదయం, మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు మొత్తం 372 మంది అభ్యర్థులకు 309 మంది మాత్రమే హాజరయ్యారు. డీఈవో అబ్రహం తెలిపారు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 5.25 పైII
తణుకు ఆఫీసు: 08819-224254

భీమవరం

•భీమవరం •ఉండి

అడుగడుగునా అవాంతరాలు



ఎస్ఆర్‌కేఆర్ కళాశాల సమీపాన నిలిచిన వాహనాలు

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: పెదఅమిరంలోని నిర్మలాదేవి వేడుక హాలులో మద్యం దుకాణాలకు లాటరీ నిర్వహించడంతో సోమవారం ఉదయం పలు రహదారులు రద్దీగా మారాయి. భీమవరం-ఏలూరు పాడు రహదారిలో ట్రాఫిక్ నిలిచిపోవడంతో విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. 10 గంటల తర్వాత పరిస్థితి కాస్త మెరుగుపడింది.

వసతి గృహంలో తనిఖీలు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: వసతి గృహాల్లో సౌకర్యాలపై భీమవరం సివిల్ జడ్జి బి.అప్పలస్వామి సోమవారం తనిఖీలు చేశారు. పట్టణంలో అంధ విద్యార్థుల కేంద్రం, ప్రభుత్వ ఎస్సీ, బీసీ వసతి గృహాలను ఆయన సందర్శించారు. సదుపాయాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ప్యానెల్ న్యాయవాదులు కె.జ్యోతి, ఎంబీ భవాని తదితరులు ఉన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి అప్పలస్వామి

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

భీమవరం పట్టణం	:80085 74471	వీరవాసరం	:80085 74475
భీమవరం మండలం	:80085 74533	ఉండి	:80085 74526
ఆకివీడు	:80085 74525	పాలకోడేరు	:80085 74467

కాళ్ల : 80085 74474

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే



సమస్య: భీమవరం నుంచి పైపుల చెరువుకు వెళ్లే మార్గం పూర్తిగా శిథిలమైంది. రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. - రామ్మోహనరావు, ప్రైవేటు ఉద్యోగి

సమాధానం: వర్షాలకు ఈ రోడ్డు శిథిలమైంది. గుంతలను వెంటనే పూడ్చేస్తాం. - పి.త్రినాథరావు, ఎంఈ

సమస్య: పట్టణంలో పలు రహదారుల పక్కన చెత్త వేస్తున్నారు. వ్యర్థాలను సకాలంలో తరలించకపోవడంతో దుర్వాసన వస్తోంది. - కె.శ్రీను, ఆర్.చంద్రరావు, భీమవరం

సమాధానం: డివిజన్ల వారీగా పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించి చెత్తను ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు తీసుకుంటాం. - సీహెచ్ వెంకటేశ్వరరావు, సహాయ కమిషనర్

150కి పైగా అక్రమ లేఅవుట్లు!

•కానరాని హెచ్చరిక బోర్డులు •ప్రభుత్వ భూముల ఆక్రమణ



వీరవాసరం పరిధి నారాయణుడుచెరువు భూమికి ఆనుకుని వైకాపా హయాంలో వేసిన అనధికార లేఅవుట్ ఇది. ఇక్కడ ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైనట్లు ఆరోపణలు ఉన్నాయి.

వీరవాసరం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రమైన భీమవరం పరిసర ప్రాంతాల్లో కొత్తగా అనధికార లేఅవుట్లు వెలుస్తున్నాయి. వైకాపా పాలనలో వందల సంఖ్యలో వెలసిన లేఅవుట్లలో కొందరు నిర్మాణాలు సైతం పూర్తి చేశారు. ఇంకొందరు అనుమతులు లేక స్థలాలను ఖాళీగా వదిలేశారు. దీంతో వందలాది మంది కొనుగోలుదారులు నష్టపోతున్నారు.

భీమవరం చుట్టూ ఉన్న వీరవాసరం, పాలకోడేరు, ఉండి మండలాల్లో వందల సంఖ్యలో అనధికార లేఅవుట్లు వెలిశాయి. గత ఐదేళ్లలో కొందరు ప్రభుత్వ స్థలాలు, పంట బోదెలు, చెరువు పోరంబోకు భూములను సైతం ఆక్రమించి స్థిరాస్తి వెంచర్లు వేశారు. భీమవరం, ఉండి నియోజకవర్గాల్లో 150కి పైగా అక్రమ లేఅవుట్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

అంతా మాయ..: కొన్ని గ్రామాల్లో భూ వినియోగ మార్పిడి చేయకుండా, మరికొన్ని చోట్ల సర్వే నంబర్లు మార్చి రిజిస్ట్రేషన్లు చేయిస్తూ వ్యాపారులు, దళారులు కొనుగోలుదారులను మోసం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా.. స్థానిక రెవెన్యూ, పంచాయతీ అధికారులు కనీసం హెచ్చరిక ఫ్లెక్సీలు కూడా ఏర్పాటు చేయకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఫిర్యాదులు బుట్టదాఖలు: వీరవాసరం, రాయకుదురు, మత్స్యపురి, కొణితివాడ, నందమూరుగరువు, తదితర గ్రామాల్లో చెరువు భూములు ఆక్రమణలకు గురయ్యాయి. వీటిపై వచ్చే ఫిర్యాదులను సైతం అధికారులు బుట్టదాఖలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. స్థిరాస్తి వ్యాపారం చేసే కొందరు అనధికార లేఅవుట్లకు ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూములను వెంచర్లలో కలిపి స్థలాలను విక్రయిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ అంశంపై ఎంపీడీవో కె. కిరణ్‌కుమార్ స్పందిస్తూ అనధికార లేఅవుట్లు వేసిన వారిపై చర్యలు తీసుకుంటామని, అనధికారమైన ప్రాంతాల్లో సర్వే చేయిస్తామని చెప్పారు.

వీరవాసరం మండలం పంజావేమవరం గ్రామంలో ఇటీవల ఏర్పాటు చేసిన అనధికార లేఅవుట్ ఇది. స్థానిక పంచాయతీ అధికారులు ఇక్కడ ఎలాంటి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయలేదు.



ప్రతి సోమవారం సదరం సేవలు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం ప్రాంతీయ ఆసుపత్రి ఆవరణలో సదరం శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. 25 మంది స్లాట్లు బుక్ చేసుకోగా ఏడుగురు హాజరయ్యారు. వారికి వైకల్య నిర్ధారణ పరీక్షలను వైద్యుడు బి.శ్రీనివాసరావు చేశారు. ఈ ఆసుపత్రిలో ఎముకల సంబంధిత వైకల్య పరీక్షలు చేస్తున్నారు. ప్రతి సోమవారం ఉదయం 9 గంటల నుంచి వైద్యులు అందుబాటులో ఉంటారని అధికారులు తెలిపారు.



ప్రదర్శనలో విద్యార్థులు, అధికారులు

తపాలా స్టాంపుల ప్రదర్శన

గునుపూడి, న్యూస్‌టుడే: భీమవరంలోని తపాలా ప్రధాన కార్యాలయంలో శ్రీవిజ్ఞాన వేదిక, తపాలాశాఖ సంయుక్తంగా సోమవారం స్టాంపులు, నాణేల ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఆ శాఖ డివిజన్ సహాయ సూపరింటెండెంట్ అల్లు సురేష్ ఈ ప్రదర్శన ప్రారంభించి మాట్లాడారు. వివిధ పాఠశాల విద్యార్థులు ఈ ప్రదర్శనను తిలకించారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: శ్రీకృష్ణదేవరాయ సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో బ్యాంకు కాలనీలో సోమవారం ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు ప్రారంభించారు. 225 మంది పరీక్షలు చేయించుకోగా 40 మందిని శస్త్రచికిత్సలకు సిఫార్సు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.



నినాదాలు చేస్తున్న చోదకులు, యూనియన్ నాయకులు

వేతనాలు చెల్లించాలంటూ నిరసన

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణాల్లో చెత్త సేకరణకు ఉపయోగిస్తున్న క్లాప్ వాహనాల చోదకులకు వేతనాలు చెల్లించాలంటూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో భీమవరంలో సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని, వాహనాలు మరమ్మతులకు గురైతే చోదకులను బాధ్యులను చేస్తున్నారని వాపోయారు. ఏఐటీయూసీ నాయకులు చెల్లబోయిన రంగారావు, కిలారి మల్లేశ్వరరావు మాట్లాడుతూ క్లాప్ వాహన చోదకులకు పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని, నెలకు రూ.18,500 చొప్పున వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో నిరవధిక సమ్మె చేపడతామని క్లాప్ వాహన చోదకుల సంఘం నాయకులు రాజు, శివ. రమణ, దైవరాజు, శామ్యూల్ తదితరులు పేర్కొన్నారు.

రజకుల సమస్యలపై వినతి

పాలకోడేరు, న్యూస్‌టుడే: పాలకోడేరులో రజకులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పోలీసులు చొరవ చూపాలని రజక సంఘం మండల అధ్యక్షుడు దొడ్డిపట్ల అమ్మారావు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఎస్సై ఎం.రవివర్మను కలిసి వినతిపత్రం అందజేశారు. సంఘం నాయకులు మల్లిపూడి వెంకటేశ్వరరావు, సమ్మలదీవి సుబ్బారావు, బండాడ ఫణీంద్ర, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ నియోజకవర్గంగా ఉండి



పెదఅమిరంలో భూమి పూజ చేస్తున్న రఘురామకృష్ణరాజు

పెదఅమిరం (కాళ్ల), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా కాళ్ల మండలం పెదఅమిరం, జక్కరం గ్రామాల్లో సీసీ రహదారుల నిర్మాణానికి ఎమ్మెల్యే కనుమూరి రఘురామ కృష్ణరాజు సోమవారం భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం, దాతల సహకారంతో వచ్చే సంక్రాంతి పండుగ నాటికి ఉండి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. ప్రతి గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తామని.. మట్టి రహదారులు లేకుండా సీసీ రోడ్లు నిర్మించేలా ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసిందన్నారు. మంచినీటి చెరువులు, పంట, మురుగు కాలువల్లో ఆక్రమణలు తొలగించి పచ్చదనం ఉట్టిపడేలా సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. సర్పంచి డి.సోమేశ్వరరావు, నాయకులు కేవీ నరసింహరాజు, ఎం.రాజేశ్, కె.రామ్మూర్తి, ఎం.కోదండరామరాజు, అధికారులు పాల్గొన్నారు.

తలుపులమ్మ లోవలో ఎమ్మెల్యే పూజలు

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా తుని మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం తలుపులమ్మ లోవ దేవస్థానంలో సోమవారం ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. పూజల అనంతరం వేద పండితులు ఆశీర్వచనాలు అందించగా దేవస్థానం డీసీ విశ్వనాథరాజు అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందజేశారు.

వసతుల కల్పనకు ప్రాధాన్యం

కొణితివాడ, నవుడూరు (వీరవాసరం), న్యూస్‌టుడే: భీమవరం నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు స్పష్టం చేశారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా కొణితివాడ, నవుడూరు, ఉత్తరపాలెం గ్రామాల్లో రూ. 49 లక్షలతో అభివృద్ధి చేయనున్న ఆరు సీసీ రహదారులకు ఆయన సోమవారం శంకుస్థాపన చేశారు. జడ్పీటీసీ సభ్యుడు గుండా జయప్రకాశ్‌నాయుడు, ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని, జనసేన పార్టీ నాయకుడు యరకరాజు హరిహరరాజు, యరకరాజు వెంకట సుబ్రహ్మణ్యంరాజు, వేగి మాధవరావు తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న రామాంజనేయులు

అటు వాననీరు.. ఇటు మురుగు



చినఅమిరం (భీమవరం గ్రామీణ), న్యూస్‌టుడే: భీమవరం మండలం చినఅమిరం గ్రామ పరిధిలోని తమ్మిరాజు- వెంకట్రాజునగర్ ప్రాంతం ఇది. ఇక్కడ పక్కా డ్రైనేజీ వ్యవస్థను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయలేదు. ఇక్కడ మురుగు నిలిచిపోవడంతో ప్రధాన రహదారి దారుణంగా మారుతోంది. భీమవరం నుంచి కలిదిండి మీదుగా విజయవాడ వెళ్లే ప్రధాన మార్గం కావడంతో నిత్యం 25 వేల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రస్తుత వర్షాలకు తోడు మురుగు రోడ్డుపైకి చేరడంతో వాహనదారులకు అవస్థలు తప్పడం లేదు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా సీసీ డ్రెయిన్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు.

కలుషిత జలాలతో కలవరం



కాళ్ల, న్యూస్‌టుడే: కాళ్ల మండలం దొడ్డనపూడి గ్రామంలోని పంటకాలువలో జలాలు కలుషితమై రంగుమారడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కాలువలో తూడుపై ఇటీవల గుత్తేదారుడు కలుపు నివారణ మందు పిచికారీ చేయడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని స్థానికులు చెబుతున్నారు. దాదాపు 6 వేల మందికి అవసరమయ్యే చెరువుకు నీటిని మళ్లించే సమయంలో గుత్తేదారుడు నిబంధనలకు విరుద్ధంగా కాలువలో గడ్డి మందు పిచికారీ చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జలాలు రంగు మారడంతో అనుమానం వచ్చి కాలువను పరిశీలించి నీటి సరఫరాను నిలుపుదల చేయించినట్లు పేర్కొన్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే గుత్తేదారులు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ అంశంపై జలవనరుల శాఖ ఏఈ ఫణిశంకర్ మాట్లాడుతూ రసాయనాలను తగు జాగ్రత్తలు పాటిస్తూ నిర్ణీత మోతాదు ప్రకారం ఉపయోగిస్తారని.. ఎండ వచ్చే సమయానికి తూడు మాడిపోతుందని పేర్కొన్నారు. దీనిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

వానొస్తే.. కష్టమే!



భీమవరం పురపాలక కార్యాలయంలో జనన, మరణాల నమోదు విభాగం ఇది. ఈ భవనం పైభాగం శిథిలమైంది. వర్షం పడినప్పుడు నీరు కిందకు చేరుతోంది. విద్యుత్తు బోర్డులు, ఫ్యాన్లు తడిసిపోతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. నీరు లీకవుతున్న చోట్ల డబ్బాలు ఉంచారు.

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం పురపాలక కార్యాలయంలో జనన, మరణాల విభాగాన్ని నిర్వహిస్తున్న భవనం శ్లాబ్ గతంలోనే శిథిలమైంది. మరమ్మతులు చేయిస్తామంటూనే కొన్నేళ్లుగా కాలయాపన చేశారు. ఈ విషయాన్ని ఎంఈ పి.త్రినాథరావు దృష్టికి తీసుకెళ్లగా వర్షాలు తగ్గిన వెంటనే పనులు చేపడతామన్నారు. ప్రస్తుతానికి ఆ విభాగంలో సిబ్బందిని మరో గదిలోకి మార్చే అంశాన్ని కమిషనర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.



ఈ భవనంలో విలువైన దస్త్రాలకు రక్షణ లేకుండా పోయింది. వర్షం కురిసినప్పుడు అవి తడిసిపోకుండా ఇలా పాతబ్యానర్లు, ఫ్లెక్సీలు కప్పి భద్రపరిచారు.

చెరువులో దూకి ఆత్మహత్య

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం పట్టణానికి చెందిన కె.సీతామహాలక్ష్మి గునుపూడి వద్ద సోమగుండం చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఆమె కుమారుడు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతూ మనస్తాపంతో ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ మృతి

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: కొవ్వాడలో ఈ నెల 10న ద్విచక్ర వాహనం ఢీకొట్టిన ఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న మేడపాటి చంద్రలీల(50) మృతి చెందినట్లు స్టేషన్ రైటర్ మహేశ్ తెలిపారు. కూలిపనికి వెళ్తున్న ఆమె ప్రమాదానికి గురికాగా స్థానికులు ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

17 ఏళ్ల బాలిక అదృశ్యం

ఉండి, న్యూస్‌టుడే: ఉండి గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలిక అదృశ్యమైంది. ఆమె ఈ నెల 11న మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. వివిధ ప్రాంతాల్లో గాలించినా ఆమె ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇరు వర్గాలపై కేసులు

పాలకోడేరు, న్యూస్‌టుడే: పెన్నాడపాలెంలో సరిహద్దు తగదా నేపథ్యంలో ఆదివారం రాత్రి ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. దీనిపై ఇరు పక్షాలకు చెందిన ఆరేపల్లి వెంకటేశ్వరావు, చంద్రరావులతో సహా నలుగురిపై కేసులు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు తెలిపారు.

ఊరేగింపులు.. నిమజ్జనోత్సవాలు



యండగండి: ప్రత్యేక రథంపై అమ్మవారి గ్రామోత్సవం

ఉండి, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల ముగింపు సందర్భంగా పలు ప్రాంతాల్లో అమ్మవారి విగ్రహాలను సోమవారం ఊరేగించి నిమజ్జనం చేశారు. ఉండి రాజులపేటలో సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించిన కనకదుర్గమ్మ ప్రతిమను ప్రత్యేక రథంపై ఊరేగించారు. అడుగడుగునా భక్తులు ఎదురొచ్చి పసుపు, కుంకుమలు సమర్పించారు. యండగండిలో అమ్మవారి ఊరేగింపు వైభవంగా జరిగింది. ఉండి కొత్తపేట, సాలిపేటల్లో అన్నసమారాధనలు జరిగాయి.

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: భీమవరం మెంటేవారితోటలో బాలాత్రిపుర సుందరి ఆలయంలో విశేష పూజ నిర్వహించారు. అనంతరం ప్రత్యేక వాహనంలో అమ్మవారి ప్రతిమను కొలువుదీర్చి ఊరేగించారు. మావుళ్లమ్మ ఆలయం వద్ద ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధనను ప్రారంభించారు.



పెద్దింట్లమ్మకు నైవేద్యం సమర్పిస్తున్న ఏవో, అర్చకులు, భక్తులు

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు పుర దేవత పెద్దింట్లమ్మకు సోమవారం నైవేద్యం సమర్పించారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

90 కిలోల లడ్డూ.. రూ.1.11 లక్షలు

మహాలక్ష్మీపురం (ఆకివీడు), న్యూస్‌టుడే: ఆకివీడు మండలం చినకాపవరం గ్రామ పరిధి మహాలక్ష్మీపురం ప్రాంతంలో రామాలయం వద్ద ప్రతిష్ఠించిన అమ్మవారికి సమర్పించిన 90 కిలోల లడ్డూ ప్రసాదానికి ఆదివారం రాత్రి వేలం నిర్వహించారు. భూపతిరాజు రంగరాజు అల్లుడు ఎస్.నరేశ్ రూ.1.11 లక్షల హెచ్చు పాటకు లడ్డూ ప్రసాదం దక్కించుకున్నారు.



ప్రసాదంతో నరేశ్

రంగంలోకి క్లూస్‌టీం

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు రైల్వేస్టేషన్ రోడ్డులో చేపల వ్యాపారి షేక్ అజ్మీర్‌బాబా ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి విషయం విదితమే. సోమవారం క్లూస్ టీం సభ్యులు ఘటనా స్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు. మూడు కాసుల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, కొంత నగదు చోరీకి గురైనట్లు ఎస్సై తెలిపారు. అజ్మీర్‌బాబా అమెరికాలో ఉండటంతో ఆయన బంధువు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగరాజు చెప్పారు.



ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

లోనికి వెళ్లే దారి లేదు!

వీరవాసరం, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన వీరవాసరం బస్టాండ్ ప్రాంగణంలో ఇలా మురుగు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తూర్పు చెరువు కూడలి వద్ద 165 జాతీయ రహదారి వెంబడి ఉన్న ఈ బస్టాండ్ ఎదుట రహదారికి మరమ్మతులు చేశారు. తరువాత ఈ ప్రాంగణం రహదారి కంటే పల్లంగా మారడంతో వాననీరు వెళ్లే మార్గం లేకుండా పోయింది. దీంతో కనీసం అక్కడ నిలబడేందుకు కూడా కూడా అవకాశం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. ఈ ప్రాంతంలో డ్రెయిన్ నిర్మించాలని స్థానికులు కోరుతున్నా అధికారులు, పాలకవర్గం పట్టించుకోవడం లేదు. ఈ సమస్యపై పంచాయతీ కార్యదర్శి లక్ష్మి స్పందిస్తూ బస్టాండ్ ప్రాంగణంలో వాననీరు నిలిచిపోకుండా చర్యలు తీసుకుంటామన్నారు.



'కార్మిక సంక్షేమాన్ని విస్మరించిన సర్కారు'

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంగ్లేయుల కాలం నుంచి పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్రం నాలుగు కోడ్‌లుగా విభజించి కార్మికులకు తీరని అన్యాయం చేసిందన్నారు. హక్కుల సాధనకు సంఘటితంగా పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భీమవరం సినిమాలు

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే

శ్రీపద్మాలయ స్క్రీన్ 1	వేట్టయన్
శ్రీపద్మాలయ స్క్రీన్ 2	దేవర
కిషోర్ స్క్రీన్ 1	విశ్వం
కిషోర్ స్క్రీన్ 2	జిగ్రా
నటరాజ్	జనక అయితే గనక
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 1	వేట్టయన్
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 2	విశ్వం
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 3	శ్వాగ్
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 4	దేవర
విజయలక్ష్మి స్క్రీన్ 1	మార్టిన్
మహాలక్ష్మి స్క్రీన్ 2	మా నాన్న సూపర్ హీరో



భీమవరం మండలంలో తీర ప్రభావిత గ్రామమైన నాగిడిపాలెం పంచాయతీలో రహదారి ఇది. ఈ గ్రామ జనాభా సుమారు 2 వేలు. భీమవరం నుంచి 216 తీర ప్రాంత జాతీయ రహదారికి వెళ్లే ముఖ్య రహదారుల్లో ఇది ఒకటి. స్థానికులతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన వారి రాకపోకలతో రద్దీగా ఉండే ఈ మార్గం కొన్నేళ్ల నుంచి అధ్వానంగానే ఉంది.

ఎన్నేళ్లో.. నరకయాతన!

మరింత ఛిద్రమైన రహదారులు

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: భీమవరం నియోజకవర్గ పరిధిలో కీలకమైన రహదారులు అత్యంత దారుణంగా తయ్యారయ్యాయి. గత అయిదేళ్లలో నిధులు లేక అభివృద్ధికి నోచుకోని రహదారులు ఎన్నో ఉన్నాయి. కొన్నింటికి నామమాత్రంగా నిధులిచ్చినా నాటి పాలకుల వైఖరితో టెండర్లు వేసేందుకు గుత్తేదారులు ముందుకు రాలేదు. దీంతో కాళీపట్నం, నాగిడిపాలెం, భీమవరం-ఎల్‌వీఎన్‌పురం, తోకతిప్ప తదితర రహదారులు పూర్తిగా ఛిద్రమయ్యాయి. వీరవాసరం మండలంలో వీరవాసరం-నవుడూరు తదితర మార్గాలు అధ్వానంగా తయారయ్యాయి. ఈ అంశంపై ఆర్అండ్‌బీ ఏఈ రాజశేఖర్ స్పందిస్తూ అత్యవసర మరమ్మతులకు నిధులు విడుదలయ్యాయని తెలిపారు. వీటికి ఈ నెల 15న టెండర్లు పిలుస్తున్నట్లు వెల్లడించారు.

డెల్టాలో కీలకమైన భీమవరం-కాళీపట్నం ప్రధాన రహదారి ఇది. గత అయిదేళ్లుగా నిర్వహణ లేకపోవడంతో భారీ గుంతలు ఏర్పడి వర్షం పడినప్పుడు మడుగులను తలపిస్తున్నాయి. సీపీఎం మండల నాయకులు ఇటీవల ఈ గుంతల వద్ద నిరసన తెలిపారు. రోడ్డు దుస్థితిని తెలియజెప్పేలా గుంతల్లో ఇలా వల వేశారు. నరసాపురం, మొగల్తూరు మండలాల్లో అనేక గ్రామాలను అనుసంధానం చేసే ప్రధాన మార్గం ఇది.



నరసాపురం

• నరసాపురం • పాలకొల్లు • ఆచంట

సచివాలయాల సందర్శన



దస్త్రాలు పరిశీలిస్తున్న కమిషనర్

నరసాపురం, న్యూస్‌టుడే: పట్టణంలోని 13, 15 వార్డు సచివాలయాలను సోమవారం పురపాలక కమిషనర్ ఎం.అంజయ్య సందర్శించారు. దస్త్రాలు పరిశీలించారు. సమయానికి విధులకు హాజరుకాని సిబ్బంది గైర్హాజరైనట్లు నమోదు చేశారు. మూమెంటు రిజిస్టర్ నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది ఏకరూప దుస్తులు ధరించి రావాలని సూచించారు. పలు వార్డుల్లో పర్యటించిన ఆయన పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు.

బీమా క్లెయిమ్‌లను విడుదల చేయాలని నిరసన

ఆచంట(మార్టేరు), న్యూస్‌టుడే: అధిక వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలకు గత నాలుగేళ్లుగా బీమా క్లెయిమ్‌లు ఇవ్వక రైతులు నష్టపోతున్నారని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఇందుకూరి సూర్యనారాయణరాజు ఆవేదన వ్యక్తం చేశారు. వల్లూరులో సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వల్లూరు సహకార సంఘంలో 850 మంది రైతులు తమ పొలం పత్రాలను తనఖా పెట్టి అప్పులు తీసుకున్నారని, పంట పాడైనప్పటికీ వారికి ఎటువంటి బీమా చెల్లింపులు జరగడం లేదని మండిపడ్డారు కార్యక్రమంలో రైతులు టి.సుబ్బారావు, ఎన్.పాపారావు, సత్యనారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నతాధికారులు పరిష్కరిస్తారని

నరసాపురం, న్యూస్‌టుడే: తాము ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నెల తరబడి కాళ్లరిగేలా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా క్షేత్రస్థాయి అధికారులు పరిష్కరించడం లేదని పలువురు ప్రజలు వాపోతున్నారు. దీంతో తాము దూర, భారాన్ని భరిస్తూ డివిజన్‌స్థాయిలో నిర్వహిస్తున్న 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక'కు రావాల్సి వస్తోందని ప్రజలు 'న్యూస్‌టుడే' వద్ద ఆవేదన వ్యక్తం

మార్గం ఆక్రమణ



మా ఇంటివద్ద నడకకు వదులుకున్న సొంత స్థలాన్ని కొందరు ఆక్రమించారు. దీనిపై సర్వే నిర్వహించి న్యాయం చేయాలని మండలస్థాయిలో అధికారులకు వినతిపత్రం అందించినా పరిష్కరించలేదు. అందుకే డివిజన్‌స్థాయిలో నిర్వహిస్తున్న 'మీ కోసం'కు రావాల్సి వచ్చింది. -అందె పల్లయ్యతాత, కేపీపాలెంసౌత్

నాలుగు నెలలుగా తిరుగుతున్నా



నా కుమారుడికి గతంలో కృష్ణబాబు కాలనీలో ఇంటి స్థలం ఇచ్చారు. పట్టా మాత్రం ఇవ్వలేదు. నా కుమారుడు తన కుటుంబంతో కలిసి ఆ స్థలంలోనే ఉండేవాడు. ఇటీవల మృతి చెందాడు. మనవడితో కలిసి నేను ఆ స్థలంలో ఉన్న రేకుల షెడ్డులో నివసిస్తున్నా. ఆ స్థలానికి పట్టా నకలు ఇప్పించాలని నాలుగు నెలలుగా తహసీల్దార్ కార్యాలయానికి తిరిగినా పనిజరగలేదు. -గుబ్బల సంధ్యావతి, కృష్ణబాబుకాలని, నరసాపురం

టికెట్లు జారీ నిలిపివేశారు



పట్టణంలో ఉన్న తితిదే కల్యాణ మండపంలో గతంలో వెంకటేశ్వరస్వామి దర్శనం, ఇతర సేవా టిక్కెట్లు జారీ చేసేవారు. వైకాపా ప్రభుత్వ హయాంలో వాటిని నిలిపివేశారు. ఆ సేవలు పునరుద్ధరించాలని పలు పర్యాయాలు అధికారులకు వినతులు అందించినా చేయలేదు. -పోలిశెట్టి సాంబ, నరసాపురం

జాప్యం లేకుండా చర్యలు: ఆర్డీవో



వినతులు స్వీకరిస్తున్న ఆర్డీవో

నరసాపురం, న్యూస్‌టుడే: ప్రజల నుంచి వచ్చిన వినతులన్నిటినీ జాప్యం లేకుండా పరిష్కరించాలని ఆర్డీవో దాసి రాజు సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. నరసాపురం రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక(మీ కోసం)లో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పరిష్కారం నిమిత్తం వాటిని సంబంధిత శాఖల అధికారులకు నివేదించాలని కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు. మొత్తం 20 మంది వినతులు అందించారని కార్యాలయ జూనియర్ అసిస్టెంటు బి.సురేఖ తెలిపారు. లిఖితపూడికి సర్వేయర్‌ను నియమించాలని బెల్లపు వెంకట సుబ్రహ్మణ్యం, తమ భూమికి సర్వే నిర్వహించి ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని శివదేవుని చిక్కాలకు చెందిన నల్లి సుబ్బలక్ష్మి, నగదు తీసుకుని మోసగించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని శేరేపాలేనికి చెందిన ఆదూరి ఏడుకొండలు, ఆస్తి వివాదం నేపథ్యంలో తనకు ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలని పోడూరు మండలం గుమ్ములూరుకు చెందిన నంబు సురేష్‌బాబు వినతిపత్రాలు అందించారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఆర్డీవో హామీ ఇచ్చారు.

మీకోసంకు మూడు వినతులు

పెనుగొండ, న్యూస్‌టుడే: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో మూడు వినతులు అందాయని తహసీల్దార్ జి.అనితాకుమారి తెలిపారు. పంచాయతీరాజ్, రెవెన్యూ, విద్యుత్తు సంస్థకు ఒకటి చొప్పున వినతులు అందించారన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖాధికారులు పాల్గొన్నారు.

స్పందనకు పందిరి

శుభ్రం చేశారు.. **పెనుగొండ, న్యూస్‌టుడే:** పెనుగొండ సంతమార్కెట్ ఆవరణలో చెత్త పేరుకుపోయి దుర్వాసన, దోమలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తీసుకురాగా ఈ నెల 7న 'ఈనాడు'లో ప్రచురితమైంది. దీనికి పెనుగొండ సర్పంచి నక్కా శ్యామలాసోని, పంచాయతీ కార్యదర్శి టి.రత్నాకరరావు స్పందించారు. పారిశుద్ధ్య సిబ్బందితో చెత్తను తొలగింపజేశారు.

ఈనాడు కథనాలకు స్పందన



పాదుల తొలగింపు.. **పెనుగొండ గ్రామీణ, పెనుగొండ, న్యూస్‌టుడే:** మండలంలోని కొఠాలపర్రు మెయిన్ సెంటర్‌లో విద్యుత్తు స్తంభానికి పాదులు అల్లుకున్నాయి. సమీపంలోని పరివర్తకం వద్ద ఇదే పరిస్థితి. ఈ నేపథ్యంలో ఈ నెల 12న 'అల్లుకున్న నిర్లక్ష్యం!' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. ఈ విషయమై విద్యుత్తు ఏడీఈ కె.రాంబాబు స్పందించి తమ సిబ్బందితో సోమవారం స్తంభాన్ని అల్లుకున్న పాదులు తొలగింపజేశారు. స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పంట కాలువ ప్రక్షాళనకు చర్యలు.. **నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే:** సరిపల్లి, లిఖితపూడి, పట్టణ పరిధిలోని గ్రేస్ నగర్‌లో సుమారు 600 ఎకరాల విస్తీర్ణంలోని పొలాలకు సాగునీరందించే సరిపల్లి పంట కాలువ తూడు, గుర్రపు డెక్క, ఆక్రమణలతో నిండిపోయింది. ఈ సమస్యపై 'కాలువలు ఇలా.. సాగునీరు పారేదెలా' శీర్షికన 'ఈనాడు'లో ఈ నెల 12న ప్రచురితమైన కథనానికి జలవనరులశాఖ అధికారులు స్పందించి పంట కాలువ ప్రక్షాళనకు చర్యలు చేపట్టారు. ఆ శాఖ ఏఈఈ బి.మోహనకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం కాలువలో గుర్రపు డెక్క, తూడు, ఆక్రమణలు తొలగించే పనులు చేపట్టారు. దీంతో కాలువ పరిధిలోని గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



జాతీయ రహదారికి మరమ్మతులు.. **నరసాపురం, న్యూస్‌టుడే:** నరసాపురం నియోజకవర్గ పరిధిలోని 216 జాతీయ రహదారికి సోమవారం మరమ్మతులు చేపట్టారు. 'ప్రమాదకరంగా జాతీయ రహదారి' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ మచిలీపట్నం ప్రాజెక్టు ఏఈ వెంకటరమణ స్పందించారు. గుత్తేదారు సంస్థ కార్మికులతో మరమ్మతులు చేయించారు.

కాలువకాదు ప్రధాన రహదారే!



యలమంచిలి కూడలిలో ప్రధాన మార్గంలో వర్షపునీరు

యలమంచిలి, న్యూస్‌టుడే: యలమంచిలి ప్రధాన కూడలి, చిలుకూరివీధి శివారున మురుగు నీరు ప్రవహించేందుకు అనువైన వ్యవస్థ లేదు. నీరు డ్రెయిన్లోకి దిగాల్సిన ప్రాంతాలు ఎత్తుగా ఉండటం, ఇతర సమస్యలతో వర్షం కురిసిన ప్రతిసారి ప్రధాన రహదారులు సైతం నీట మునుగుతున్నాయి. సోమవారం కురిసిన వర్షానికి యలమంచిలిలో వీధులన్నీ జలమయమయ్యాయి.



మొగల్తూరు: జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఇలా..

మొగల్తూరు, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఆదివారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షానికి పల్లపు ప్రాంతాల్లోకి నీరు చేరింది. మొగల్తూరు పెన్మత్స రంగరాజు జడ్పీ ఉన్నత పాఠశాల, జగనన్న, ఇందిరమ్మ కాలనీల్లో రహదారులపై నీరు నిలిచింది. దీంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

పాలకొల్లులో భారీ వర్షం



బస్టాండ్ ప్రాంతంలో వర్షం

పాలకొల్లు పట్టణం, న్యూస్‌టుడే: పాలకొల్లులో సోమవారం కురిసిన భారీ వర్షానికి జనజీవనం స్తంభించింది. అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పల్లపు ప్రాంతాల్లో ఇళ్లచుట్టూ వర్షపునీరు నిలిచింది. వ్యాపార సముదాయాలు కొనుగోలుదారులు లేక వెలవెలబోయాయి. 10.2 మి.మీ. వర్షపాతం నమోదైందని తహసీల్దార్ వై.దుర్గాకిశోర్ తెలిపారు.

కూలిన చెట్లు.. **నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే:** భారీ వర్షాల కారణంగా సోమవారం సాయంత్రం సీతారాంపురం సౌత్- రామన్నపాలెం ప్రధాన రహదారిపై సర్వీ చెట్లు కూలిపోయాయి. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడి వాహన చోదకులు ఇబ్బందులకు గురయ్యారు. వెంటనే జలవనరుల శాఖ అధికారులు స్పందించి సర్వీ చెట్లను కూలీలచే తొలగింపజేశారు.

పలు గ్రామాల్లో కుండబోత.. **పెనుమంట్ర, న్యూస్‌టుడే:** తుపాను ప్రభావంతో సోమవారం సాయంత్రం సమయంలో పెనుమంట్ర, పొలమూరు, మాముడూరు, ఆలమూరు ప్రాంతాల్లో భారీ వర్షం పడింది. తీవ్రమైన ఈదురు గాలులతో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. బ్రాహ్మణచెర్వు-పొలమూరు-నౌడూరు రహదారిలో గోతుల్లోకి నీరు చేరి చెర్వులా మారింది.

గ్రామాలకు ప్రగతి కళ తీసుకొస్తాం: పితాని



గర్వులో శిలాఫలకం ఆవిష్కరించిన సత్యనారాయణ

పెనుమంట్ర, ఆచంట, న్యూస్‌టుడే: ఎన్డీయే ప్రభుత్వం రహదారులు, డ్రెయినేజీ వంటి మౌలిక సదుపాయాలు కల్పించి గ్రామాలకు ప్రగతి కళ తీసుకురానున్నదని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ తెలిపారు. ఆచంట, పెనుమంట్ర మండలాల్లో ఆచంట, మాముడూరు, గర్వు గ్రామాల్లోని రూ. 2.29 కోట్లతో నిర్మించనున్న సీసీ రహదారుల పనులకు ఆయన సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు ఉప్పలపాటి సురేష్ బాబు, ఎంపీపీ దిగమర్తి సూర్యకుమారి, కేతా మీరయ్య, వాసంశెట్టి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం.. **పెనుమంట్ర, న్యూస్‌టుడే:** కాలువలు, డ్రెయిన్లను పూర్తిస్థాయిలో ఆధునికీకరించి ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. పెనుమంట్ర మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి(వాసు) అధ్యక్షతన సోమవారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన పితాని మాట్లాడుతూ గోస్తనీ తవ్వకం చేయడంతో పాటు సోమరాజు ఇల్లింద్రపర్రు లాకుల నిర్మాణం పూర్తి చేస్తామని చెప్పారు.

వైద్య శాఖ తీరుపై అసహనం.. వైద్య శాఖ పని తీరుపై ఎమ్మెల్యే పితాని అసహనం వ్యక్తం చేశారు. మండలంలో ఉన్న మూడు పీహెచ్‌సీల్లో నెలకు ఎన్ని ప్రసవాలు చేస్తున్నారని వైద్యులను ప్రశ్నించారు. కోట్లాది రూపాయలు వెచ్చించి పీహెచ్‌సీలను నిర్వహిస్తుంటే తణుకు ప్రైవేటు ఆసుపత్రులకు పంపడమేటనని అడిగారు. పెనుమంట్ర పీహెచ్‌సీ ఆవరణలో పశువులు కడుతున్నారని, ఇంతకన్నా దారుణమైన పరిస్థితి ఉంటుందా అని మండిపడ్డారు.

తీరంలో రోడ్లు ఛిద్రం

నరసాపురం, న్యూస్‌టుడే: నరసాపురం మండలంలోని సముద్రతీర ప్రాంత గ్రామాలకు వెళ్లే రహదారులు ధ్వంసమయ్యాయి. దీంతో వీటిపై ప్రయాణించేందుకు ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. నరసాపురం నుంచి రాజుల్లంక మీదుగా వేములదీవి, లక్ష్మణేశ్వరం- తూర్పుతాళ్లు, వేములదీవి, పెద్దసారవ, చిన్నసారవ తదితర గ్రామాలకు వెళ్లే మార్గాలపై పెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. ఆయా గ్రామాల ప్రజలు వివిధ పనుల నిమిత్తం నియోజకవర్గ కేంద్రానికి వచ్చి తిరిగి ఇళ్లకు వెళ్లేందుకు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ విషయమై ర.భ. శాఖ డీఈ కిరణ్‌కుమార్‌ను సంప్రదించగా లక్ష్మణేశ్వరం- పీయంలంక రహదారిని రూ. 10 కోట్లతో నిర్మిస్తున్నామని, ఆ పనులు పూర్తిచేసేందుకు కృషిచేస్తామన్నారు. నరసాపురం మండలంలోని రహదారుల అత్యవసర మరమ్మతులకు ప్రభుత్వం రూ.2.50 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఆ పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి పూర్తిచేస్తామన్నారు.



మరమ్మతులకు గురైన చినలంక రహదారి

నగరేశ్వర కాలనీలో సమస్యల చింత

పెనుగొండ, న్యూస్‌టుడే



ఖాళీ స్థలంలో పేరుకుపోయిన పిచ్చి మొక్కలు

పెనుగొండ నగరేశ్వర కాలనీ వాసులు అసౌకర్యాలతో ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 30 ఏళ్ల కిందట ఇక్కడ స్థల సేకరణ చేసి పట్టాలు ఇచ్చారు. ప్రస్తుతం సుమారు 400 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఇళ్ల నిర్మాణాలు చేపట్టి దశాబ్దాలు గడుస్తున్నా డ్రెయిన్లు, అంతర్గత రహదారులు నిర్మాణం చేపట్టలేదు. వర్షం కురిస్తే కాలు బయట పెట్టలేని పరిస్థితి. పెనుగొండ గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ కాలనీలో రహదారులు సరిగా లేక, ఖాళీ స్థలాల్లో విషసర్పాలు, కీటకాలతో స్థానికులు భయపడుతూ జీవిస్తున్నారు. తాగునీటికి సైతం అగచాట్లు పడుతున్నారు. ఇళ్ల వద్దే మురుగు నిలిచిపోవడంతో తరచూ అనారోగ్యానికి గురవుతున్నారు. పెద్దకాలనీ కావడంతో ఇక్కడ అంగన్‌వాడీ, ఆరోగ్య కేంద్రం, ప్రాథమిక పాఠశాల, రక్షిత మంచి నీటి ట్యాంకు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. నక్కల మురుగు కాలువ గట్టుపై సీసీ రహదారి నిర్మిస్తే ప్రయాణ సౌకర్యాలు మెరుగుపడతాయని చెబుతున్నారు. గత వైకాపా అయిదేళ్ల కాలంలో కాలనీ అభివృద్ధి ఒక్క అడుగు ముందుకు పడలేదు. కూటమి ప్రభుత్వంలో తమ సమస్యలు పరిష్కారమవుతాయని ఆశలు పెట్టుకున్నారు. కాలనీ ప్రారంభ మార్గం నుంచి సిద్ధాంతం రోడ్డు వరకు, నగరేశ్వర కాలనీ నుంచి మునమర్రు వంతెన వరకు, కాలనీ నుంచి నక్కల కాలువగట్టు వరకు రహదారులు నిర్మించాలని వార్డు మాజీ సభ్యుడు వేంద్ర సహదేవుడు కోరుతున్నారు. రహదారులు, తాగునీరు, డ్రెయినేజీ తదితర సౌకర్యాలు లేక నిత్యం అగచాట్లు పడుతున్నామని కాలనీవాసి పెచ్చెట్టి వెంకటేశ్వరరావు వాపోయారు.



రోడ్డుపై నిలిచిన నీరు

త్వరలో పనులు చేపడతాం

ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ కాలనీ అభివృద్ధికి రూ.50 లక్షలు నిధులు మంజూరు చేశారు. త్వరలో పనులు చేపడతాం. - ఎన్.కృష్ణమూర్తి, పంచాయతీరాజ్ డీఈ

అవి ఇవి అన్నీ

ఆర్థిక సాయం అందజేత.. **పెనుమంట్ర, న్యూస్‌టుడే:** అంబేడ్కర్ 69వ బౌద్ధ ధర్మ స్వీకార దినోత్సవ కార్యక్రమం సోమవారం పొలమూరు భగవాన్ బుద్ధ సేవా సమితి కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా సమితి గౌరవ అధ్యక్షుడు కేతా రామకృష్ణ ఇంజినీరింగ్, ఇంటర్ చదువుతున్న అక్కాచెల్లెళ్లు పి.మౌనిక, పి.మనీషాలకు రూ.5 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు తాడిపర్తి సంపతరావు తదితరులు పాల్గొన్నారు.



కేక్ కోస్తున్న అభిమానులు

జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు సందడి.. **పాలకొల్లు సాంస్కృతికం, న్యూస్‌టుడే:** సినీ నటుడు, జూనియర్ ఎన్టీఆర్ నటించిన దేవర చిత్రం విజయోత్సవాన్ని అభిమానులు పాలకొల్లు పట్టణం మారుతీ థియేటర్‌లో సోమవారం నిర్వహించారు. ఆవరణలో కేక్ కోసి అందరికీ పంచారు. బాణసంచా కాల్చి సందడి చేశారు.

పొలమూరులో అన్నసమారాధన.. **పెనుమంట్ర, న్యూస్‌టుడే:** దేవీ నవరాత్రి మహోత్సవాల ముగింపులో భాగంగా పొలమూరు శెట్టిబలిజ రామాలయం వద్ద యూత్ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. అనంతరం లడ్డూ, అమ్మవారికి సమర్పించిన చీరలకు వేలం పాట నిర్వహించారు

బాధితునికి సాయం.. **పాలకొల్లు పట్టణం, న్యూస్‌టుడే:** ఇటీవల ప్రమాదానికి గురైన తామరపల్లి సుబ్రహ్మణ్యంకు యునైటెడ్ కాపు వనితాక్లబ్ సభ్యులు నెలకు సరిపడా నిత్యావసర సరకులు సోమవారం అందజేశారు. క్లబ్ అధ్యక్షురాలు యామన విజయలక్ష్మి, కాంచనమాల, శైలజరాణి పాల్గొన్నారు.

విద్యుత్తు లైన్లకు మరమ్మతులు.. **మొగల్తూరు, న్యూస్‌టుడే:** మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం విద్యుత్తు సరఫరా లైన్లు మరమ్మతులకు గురవ్వడంతో మొగల్తూరు, పేరుపాలెం, కొత్తపాలెం తదితర గ్రామాల్లో సరఫరా నిలిచిపోయింది. ఏఈ శివప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది లైన్లకు మరమ్మతులు చేసి సరఫరా పునరుద్ధరించారు.

నేడు పలు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'.. **నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే:** మల్లవరం పెదలంక, కె.బేతపూడి గ్రామాల్లో మంగళవారం 'పొలం పిలుస్తోంది' నిర్వహిస్తామని మండల వ్యవసాయశాఖ అధికారి ఎం.శామ్యూల్ జాన్సన్ తెలిపారు. కార్యక్రమంలో రైతులు పాల్గొని ఆధునిక యాజమాన్య పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని కోరారు.

పంట కాలువను ఆధునికీకరించాలి.. **పెనుమంట్ర, న్యూస్‌టుడే:** పెనుమంట్ర రజకపేటలో పంటకాలువ అధ్వానంగా మారడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని, తక్షణం ఆధునికీకరించాలని సీపీఎం జిల్లా నాయకుడు ఆకుల హరేరాం కోరారు. సీపీఎం పెనుమంట్ర గ్రామ శాఖ మహాసభ సోమవారం నిర్వహించారు. గ్రామంలోని పలు సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. గ్రామ శాఖ కార్యదర్శి బత్తుల విజయకుమార్‌ను తిరిగి ఎన్నుకున్నారు.

క్షీరారామలింగేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు



పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: పాలకొల్లు పట్టణం పంచారామక్షేత్రం క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామిని పంచామృతాలతో అభిషేకించారు. అనంతరం నాగాభరణం, రుద్రాక్షలు, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. భక్తులు స్వామిని దర్శించుకుని గోత్ర నామాలతో అర్చనలు చేయించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం స్వామికి పంచహారతులు సమర్పించారు.

వైభవంగా గొంతెనమ్మ జాతర

నరసాపురం, న్యూస్‌టుడే: పేరుపాలెంనార్తు ఇంజేటివారిపాలెంలో గొంతెనమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నందీశ్వరుడికి గ్రామోత్సవం చేశారు.

భాజపా సభ్యత్వ నమోదుకు స్పందన



సభ్యత్వ నమోదులో పాల్గొన్న భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరెడ్డి

పెనుమంట్ర, న్యూస్‌టుడే: భాజపా చేపట్టిన సభ్యత్వ నమోదుకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొవ్వూరి వెంకటరెడ్డి తెలిపారు. మండలంలోని పొలమూరులో నిర్వహిస్తున్న సభ్యత్వ నమోదు ప్రక్రియను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆచంట నియోజకవర్గంలో పెనుమంట్ర మండలం ఈ నమోదులో ముందంజలో ఉందని చెప్పారు. పొలమూరు నాయకులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో నాయకులు మారుతీ, వాడపల్లి పృథ్వీరాజ్, యామజాల విశ్వనాథ్, తుపాకుల గోవింద్, యశ్వంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొగల్తూరు, న్యూస్‌టుడే: పాతపాడులో భాజపా సభ్యత్వ నమోదు సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు దాసరి బాబి, హిమగిరి, పులపర్తి రమేష్, వెంకటాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ఊరేగింపులు.. నిమజ్జనోత్సవాలు



పాలకొల్లు చేపల వర్తక సంఘంలో పల్లకిలో ఊరేగుతున్న అమ్మవారు

పెనుగొండ గ్రామీణ, నరసాపురం, మొగల్తూరు, పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి ముగింపు సందర్భంగా సిద్ధాంతం బస్టాండ్ సెంటర్‌లో కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారి ప్రతిమకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు, మేళాతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. ఘటాలదిబ్బ జైదుర్గ భవాని యూత్, పితాని వారిపాలెం శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో అమ్మవార్ల ప్రతిమలకు ఊరేగింపు నిర్వహించారు. ✦ నరసాపురం పట్టణంలోని పలు ప్రాంతాలు, మొగల్తూరు కుక్కలవారితోట, సత్రవుపాలెం తదితర గ్రామాల్లో ఏర్పాటుచేసిన అమ్మవారి ప్రతిమలకు గ్రామోత్సవం చేశారు. అనంతరం జలవనరుల్లో నిమజ్జనం చేశారు. వడయార్‌పేటలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారాధన చేశారు. ✦ పాలకొల్లు చేపల వర్తక సంఘం సభ్యులు పల్లకీని పూలతో అలంకరించి అమ్మవారి విగ్రహాన్ని ఉంచి ఊరేగించారు.



ఘటాలదిబ్బలో..



మొగల్తూరు కుక్కలవారితోటలో అమ్మవారి గ్రామోత్సవం

అమ్మవారి ఊరేగింపుల్లో వివాదాలు

మార్టేరు, న్యూస్‌టుడే: ఆచంట నియోజకవర్గ పరిధిలో ఆచంట, పెనుగొండ మండలాల్లో ఆదివారం రాత్రి అమ్మవారి నిమజ్జనం ఉత్సవాల్లో వివాదాలు చోటు చేసుకున్నాయి. ఆచంట మండలం పెనుమంచిలిలో తమ ఊరేగింపు ముందు వెళ్లాలంటే తమదే వెళ్లాలంటూ రెండు గ్రామాలకు చెందిన నిర్వాహకుల మధ్య గొడవ మొదలైంది. చివరకు పోలీసులు రంగప్రవేశం చేయడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. సిద్ధాంతంలో ఒకే సామాజిక వర్గానికి చెందిన రెండు వర్గాల మధ్య వివాదం చోటు చేసుకుంది.

ఆచూకీ లేని పల్లె బస్సు

వడలి (పెనుగొండ), న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. పల్లెబస్సులు పేరుతో నడుస్తున్న ఆర్టీసీ బస్సులు పల్లెలకు మొహం చూపడం లేదని గగ్గోలు పెడుతున్నారు. పెనుగొండ మండలం వడలి నుంచి తణుకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేయాలన్న పరిసర ప్రాంత ప్రజల చిరకాల కోరిక నేటికీ నెరవేరలేదు. వడలి నుంచి నిత్యం వ్యవసాయం, విద్య, వ్యాపారాల కోసం కూలీలు, ప్రజలు, విద్యార్థులు తణుకు ప్రయాణిస్తుంటారు. తణుకు వెళ్లాలంటే మూడు కి.మీ. దూరంలో ఉన్న పెనుగొండ, 5 కి.మీ. దూరంలో ఉన్న సిద్ధాంతం వెళ్లాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయా గ్రామాల ప్రజలు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించక తప్పటం లేదు. నరసాపురం- తణుకు బస్సు ఏర్పాటు చేస్తే మార్టేరు మీదుగా కొఠాలపర్రు, సోమరాజు చెరువు, మునమర్రు, వడలి, పిట్టలవేమవరం, అన్నవరప్పాడు మీదుగా తణుకు బస్సు సౌకర్యం కల్పిస్తామని గతంలో ఆర్టీసీ అధికారులు చెప్పినా నేటికీ అమలుకు నోచుకోలేదు. బస్సు సౌకర్యం ఏర్పాటు చేస్తే పెనుగొండ, పెరవలి, ఆచంట మండలాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెబుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆర్టీసీ బస్సు సదుపాయం కల్పించాలని కోరుతున్నారు. నరసాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ సత్తి సుబ్బన్నరెడ్డిని సంప్రదించగా బస్సు ఏర్పాటుకు చర్యలు చేపడతామన్నారు.



వడలి : బస్సులో కిక్కిరిసి ఎక్కుతున్న విద్యార్థులు

తాడేపల్లిగూడెం
•తాడేపల్లిగూడెం •తణుకు

ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి


మాట్లాడుతున్న జ్యోతి

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: అభ్యసన సమస్య ఉన్న విద్యార్థులపై శ్రద్ధ వహించి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ప్రధానోపాధ్యాయిని జ్యోతి పేర్కొన్నారు. స్థానిక సుబ్బారావుపేట భవిత దివ్యాంగుల పాఠశాలలో అభ్యసన సమస్యల పిల్లలపై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో 20శాతం విద్యార్థులు ఈ తరహా లోపం కలిగి ఉన్నారన్నారు. అలాంటి వారిని గుర్తించి సరైన శిక్షణ ఇస్తే సాధారణ పిల్లలుగా మారతారని పేర్కొన్నారు.

ఆరోపణలపై విచారణ చేయండి



నిరసనలో పాల్గొన్న నాయకులు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: వరద ఖర్చుల అవినీతి ఆరోపణలపై సమగ్రంగా విచారణ చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక శేషమహల్ కూడలి వద్ద సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రభుత్వం చెబుతున్న వరద ఖర్చు చూస్తుంటే అవినీతి తారాస్థాయిలో జరిగినట్లు తెలుస్తోందన్నారు. మామిడి దానయ్య ప్రసాద్, వెంకటేశ్వరరావు, ప్రసాద్ కుమార్ పాల్గొన్నారు.


ప్రహసనంగా చెత్త సేకరణ..!


రోడ్డుపై పేరుకుపోయిన వ్యర్థాలు

సిబ్బంది కొరతతో వెతలు

తాడేపల్లిగూడెం అర్బన్, తణుకు గ్రామీణ, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం, తణుకు పురపాలక సంఘాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. గ్రామీణ ప్రాంత ప్రజలు ఉపాధి, విద్య, వ్యాపారాల రీత్యా పట్టణాల్లో ఆవాసాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. అయితే ఆ మేరకు మౌలిక సదుపాయాలు కల్పించే విషయంలో అధికారులు విఫలమవుతున్నారు. ప్రధానంగా పారిశుద్ధ్య నిర్వహణ అత్యంత దారుణంగా ఉంది. తగ్గ సిబ్బంది లేక కార్మికుల కొరత ఆపసోపాలు పడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. సిబ్బంది కొరత వేధిస్తుండటంతో క్రమం తప్పకుండా ఇంటింటి చెత్త సేకరణ ప్రహసనంగా మారింది.

మురుగు కూపాలుగా ఖాళీ స్థలాలు.. తాడేపల్లిగూడెం పురపాలక సంఘం సుమారు 25 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో వ్యాపించి ఉంది. విద్య, వ్యాపార రంగాల్లో పురోగతి సాధించినా పారిశుద్ధ్య నిర్వహణ విషయంలో అట్టడుగున ఉంది. ఏటా కోట్ల నిధులు ఖర్చు చేస్తున్నా పరిస్థితుల్లో ఎలాంటి మార్పు రావడం లేదు. అవసరం మేరకు పారిశుద్ధ్య సిబ్బంది లేక పోవడంతో నానాటికీ పరిస్థితి దారుణంగా మారుతోంది. ఖాళీ స్థలాలు మురుగు కూపాలుగా దర్శనమిస్తున్నాయి. ప్రధాన మురుగు బోదెలతో పాటుగా అంతర్గత మురుగు కాలువలు సైతం వ్యర్థాలతో పూడిపోయాయి. ప్రధాన కూడళ్లు, రహదారులు, కాలువలు, చెరువుల్లో చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. దుర్వాసన వెదజల్లుతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అపరిశుభ్ర పరిస్థితులతో దోమలు విజృంభిస్తున్నాయి. తణుకు పురపాలక సంఘంలో కూడా ఇదే పరిస్థితి ఉండటం గమనార్హం.




తాడేపల్లిగూడెం డంపింగ్ యార్డు

రూ.31.32 లక్షల భారం.. గత ప్రభుత్వ పాలనలో ఇంటింటి చెత్త సేకరణకు క్లాప్ వాహనాలు పంపిణీ చేశారు. వీటి నిర్వహణ బాధ్యత మున్సిపాలిటీలపై వేశారు. తాడేపల్లిగూడెం, తణుకు పురపాలక సంఘాలకు 58 క్లాప్ వాహనాలను అందించారు. ఒక్కో వాహనానికి సగటును రూ.54 వేలు చెల్లించే విధంగా మార్గదర్శకాలను జారీ చేశారు. ఈ మేరకు ప్రతినెలా సుమారు రూ.31.32 లక్షల భారం ఆయా మున్సిపాలిటీలపై పడుతోంది. ఈ మొత్తాన్ని సాధారణ నిధుల నుంచి చెల్లిస్తుండటంతో పురపాలక సంఘాల అభివృద్ధి కుంటుపడుతోంది.

మున్సిపాలిటీ	తణుకు	తాడేపల్లిగూడెం
జనాభా (లక్షలు)	1.05	1.20
క్లాప్ వాహనాలు	24	34
రోజువారీ ఉత్పత్తి అయ్యే చెత్త (టన్నులు)	45	60-70

"పారిశుద్ధ్య పరిస్థితులు మెరుగుపరిచేందుకు కృషి చేస్తాం. ఇంటింటి చెత్త సేకరణ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకుంటాం. మురుగు కాలువలను క్రమం తప్పకుండా శుభ్రం చేయిస్తాం." అని మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..
10 AM to 1 PM

తాడేపల్లిగూడెం	:79950 67078
పెంటపాడు	:79939 36123
తణుకు గ్రామీణ	:85558 50851
అత్తిలి	:91548 46774

పెంటపాడు న్యూస్‌టుడే

సమస్య : పెంటపాడు శ్మశానవాటికలో విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. అంత్యక్రియలు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నాం. - **రమేశ్‌రెడ్డి, గ్రామస్థుడు**

సమాధానం : విద్యుద్దీపాలకు మరమ్మతులు నిర్వహించి వెలిగేలా చేస్తాం. - **బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి**

సమస్య : పెంటపాడు గాంధీబొమ్మ కూడలిలో ఉదయం, సాయంత్రం వాహనాల రద్దీ అధికంగా ఉంటోంది. కూడలిలో దుకాణాలకు వెళ్లేవారు రోడ్లపైనే వాహనాలు నిలుపుదల చేస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. - **లక్ష్మణ్, స్థానికుడు**

సమాధానం : ఉదయం, సాయంత్రం ట్రాఫిక్‌ని నియంత్రిస్తాం. రోడ్లపై వాహనాలు నిలిపివేయకుండా చర్యలు తీసుకుంటాం. - **స్వామి, ఎస్సై, పెంటపాడు**

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే

సమస్య : కొమరవరం నుంచి కె ఇల్లింద్రపర్రు వెళ్లే రహదారి పక్కన వ్యర్థాలను నిప్పుపెట్టడంతో పొగకమ్ముకుని వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. - **వాహనదారుడు**

సమాధానం: వ్యర్థాలకు నిప్పుపెట్టకుండా చర్యలు తీసుకుంటాం. - **రామ్‌ప్రసాద్, ఈవోపీఆర్డీ**

వీరభద్రుడికి విశేష పూజలు



తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: తణుకు పైడిపర్రు శివాలయంలో భద్రకాళీ సమేత వీరభద్రేశ్వర స్వామికి సోమవారం సందర్భంగా విశేష అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా తెల్లవారుజామున స్వామి వారికి పల్లకి సేవ నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు నక్షత్ర హారతి ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

టిడ్కో గృహాల పరిశీలన

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: టిడ్కో గృహ సముదాయాల్లోని ఖాళీ స్థలాలను శుభ్రం చేయాలని కమిషనర్ ఏసుబాబు పేర్కొన్నారు. పట్టణంలోని టిడ్కో గృహాలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.



కాలనీల అభివృద్ధిపై దృష్టి : బొలిశెట్టి

పెంటపాడు, న్యూస్‌టుడే: ఎస్సీ కాలనీల అభివృద్ధికి ఎన్డీయే ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆయన పెంటపాడు మండలం పెంటపాడు, ఆకుతీగపాడు గ్రామాల్లో జరిగిన పల్లె పండుగ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీసీరోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నా ఎస్సీ, నా ఎస్టీ అంటూ వేదికలపై ఊదరగొట్టిన మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, వైకాపా నాయకులు ఎస్సీకాలనీల్లో మౌలిక వసతులు కల్పించలేక పోయారన్నారు. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎస్సీ కాలనీల అభివృద్ధికి తొలి ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు ఎస్సీలకే వినియోగించేలా ప్రణాళిక రూపొందించామన్నారు. వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రాష్ట్రాభివృద్ధి కుంటుపడిందన్నారు. గాడి తప్పిన రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు సీఎం నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దాసరి హైమావతి, ఎన్డీయే నాయకులు తాడేపల్లి సూర్యకళ, కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, బందారు వెంకట్రావు, కొవ్వూరి లక్ష్మణరెడ్డి, మట్టా సత్యనారాయణ, పాలూరి వెంకటేశ్వరరావు, నల్లమిల్లి వినిగోపిరెడ్డి, మదులత, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ★ పెంటపాడు ఎస్సీకాలనీలో సామాజిక భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. సోమవారం ఆయన గ్రామంలోని కమ్యూనిటీ హాలు ప్రాంగణం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు.


కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీనివాస్ తదితరులు

ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే : వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వరరావు సూచించారు. పట్టణంలోని ఆరో వార్డులో నిర్వహిస్తున్న ఫీవర్ సర్వే సోమవారం పర్యవేక్షించి మాట్లాడారు. సీజన్ వ్యాధులకు ప్రధాన కారణం వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించకపోవడమన్నారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. చిన్న చిన్న నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, ఆహార పదార్థాలపై మూతలు వేసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం పెనుగొండ మండలం సిద్ధాంతం పీహెచ్‌సీ పరిధిలో నిర్వహిస్తున్న ఫీవర్ సర్వే పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ సుప్రియ, విజయకుమార్, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


తణుకు: అవగాహన కల్పిస్తున్న వెంకటేశ్వరరావు


కుంచనపల్లి: పరిసరాలు పరిశీలిస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఆరోగ్య నియమాలు పాటించాలి

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: ఆరోగ్య నియమాలు పాటించి రోగాలకు దూరంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి లక్ష్మణరావు అన్నారు. కుంచనపల్లి గ్రామంలో పరిసరాల శుభ్రతపై అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. నీటి నిల్వలు ఉన్న ప్రాంతాలు గుర్తించి పరిష్కార మార్గాలు సూచించారు.

సాగునీటికి ఆటంకం కలిగిస్తున్నారంటూ ఫిర్యాదు

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే : అత్తిలి పెద్ద వంతెన నుంచి మంచిలి వరకు కాలువపై ఇష్టారాజ్యంగా వంతెనలు నిర్మించారు. శివారు గ్రామాల రైతులకు సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గట్టు బలహీనపడి కాలువలోకి జారిపోతున్నాయని దిరిశాల మునేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం స్పందన కార్యక్రమంలో అత్తిలి తహసీల్దార్ కార్యాలయంలో ఆయన ఫిర్యాదు చేశారు. అనుమతులు లేని వంతెనల నిర్మాణాలపై చర్యలు తీసుకుంటామని జలవనరుల శాఖ ఏఈ అనిల్ తేజ చెప్పారు.

నీటిని శుద్ధి చేయాలంటూ వినతి

గణపవరం, న్యూస్‌టుడే: జల్లికాకినాడ వాసులకు శుద్ధి చేసిన తాగునీరు అందించాలని సీపీఎం నాయకులు విజ్ఞప్తి చేశారు. గ్రామంలో సోమవారం పీవీఆర్ సుబ్రహ్మణ్యం అధ్యక్షతన పార్టీ 8వ మహాసభ నిర్వహించారు. జగన్నకాలనీలో రహదారులు, మురుగు కాలువలు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

విధిగా ఓటు నమోదు చేసుకోవాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాధాకృష్ణ

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: డిగ్రీ పొందిన ప్రతి ఒక్కరూ గ్రాడ్యుయేట్ ఓటర్లుగా నమోదు కావాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ కోరారు. స్థానిక వీకే కన్వెన్షన్ హాల్‌లో రాధాకృష్ణ అధ్యక్షతన సోమవారం ఉమ్మడి గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్సీ చిరంజీవిరావు, ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు మాట్లాడారు. రాధాకృష్ణ మాట్లాడుతూ పట్టణ, గ్రామాల్లో గ్రాడ్యుయేట్లను గుర్తించి నవంబరు ఆరులోపు ఓటర్లుగా నమోదు చేయించేలా తెదేపా, జనసేన, భాజపా నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ చిరంజీవిరావు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలన్నారు. ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు మాట్లాడుతూ గతంలో తెదేపా అధికారంలో లేనప్పటికీ మూడు స్థానాల్లో గెలుపొందామన్నారు. కార్యక్రమంలో ఎన్డీయే నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో డిగ్రీ పూర్తయిన ప్రతి ఒక్కరి చేత ఓటు నమోదు చేయించడంలో కూటమి నేతలు ముందుండాలని ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక మారిశెట్టి ఫంక్షన్ హాలులో పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి ఓటు నమోదుపై అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో కూటమి నాయకులు భాగస్వాములు కావాలని తెలిపారు. బలపరిచిన అభ్యర్థికి అత్యధిక మెజార్టీ లభించే విధంగా కృషి చేయాలన్నారు. వేపాడ చిరంజీవి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా నాయకులు కృషి చేయాలన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరి చేత ఓటు నమోదు చేయించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జీ, రాజశేఖర్, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'పల్లె పండుగ'

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: అత్తిలి మండలం కె.సముద్రపుగట్టులో సోమవారం తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ నాయకులు, కార్యకర్తలతో కలిసి పల్లె పండగ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని సమస్యలను ఇంటింటికీ వెళ్లి అడిగి తెలుసుకున్నారు. అంతర్గత సీసీ డ్రయిన్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. అత్తిలి తెదేపా అధ్యక్షుడు ఆనాల ఆదినారాయణ, తహసీల్దార్ దశిక వంశీ, ఎంపీడీవో శామ్యూల్, గ్రామ తెదేపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ

గణపవరం, న్యూస్‌టుడే: పిప్పర జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు టేబుల్ టెన్నిస్ పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు పి.రాజు వెంకటేశ్వర్లు తెలిపారు. ఇటీవల భీమవరంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో అండర్ 14 విభాగంలో యు.వరుణ్, అండర్ 17 విభాగంలో బూసి సుధీర్ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి అర్హత సాధించారన్నారు. త్వరలోనే నంద్యాలలో జరగనున్న పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామస్థులు సోమవారం అభినందించారు.

ఉద్యానంలో పారిశుద్ధ్య చర్యలు

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: అత్తిలి బస్టాండు కూడలిలో కాలువకు ఆనుకొని నిర్మించిన ఉద్యానం చెత్తాచెదారంతో అధ్వానంగా మారిందని సోమవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి పంచాయతీ సిబ్బంది స్పందించారు. అత్తిలి పంచాయతీ కార్యదర్శి భాస్కర్ ఆధ్వర్యంలో సిబ్బందితో ఉద్యానవనాన్ని శుభ్రం చేయించారు. చెత్తాచెదారం వేయకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

ఈనాడు స్పందన

పొంచి ఉన్న ప్రమాదం



రేలంగి, తణుకు గ్రామీణ, న్యూస్‌టుడే: ఇరగవరం నుంచి కావలిపురం వెళ్లే రహదారిలో వంతెన రెయిలింగ్ శిథిలమై ప్రమాదకరంగా మారింది. నిత్యం ఇటుగా మండల కేంద్రానికి వచ్చేందుకు రేలంగి, కావలిపురం తదితర గ్రామాల ప్రజలు వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. అయితే మలుపులో ఉండటంతో పెద్ద పెద్ద వాహనాలు వచ్చినప్పుడు, రాత్రి సమయాల్లో చోదకులు కాలువలోకి వెళ్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రెయిలింగ్ ఏర్పాటు చేయాలని చోదకులు కోరారు. దీనిపై పీఆర్ ఏఈ సత్యరుషి మాట్లాడుతూ ప్రతిపాదనలు సిద్ధం చేశామని నిధులు మంజూరైతే పనులు చేపడతామన్నారు.

'కార్మిక సంక్షేమాన్ని విస్మరించిన సర్కారు'



తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంగ్లేయుల కాలం నుంచి పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్రం నాలుగు కోడ్‌లుగా విభజించి కార్మికులకు తీరని అన్యాయం చేసిందన్నారు. హక్కుల సాధనకు సంఘటితంగా పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.